స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

గురువారం | 29.05.2025 | సంపుటి : 2 | సంచిక :117 | పేజీలు : 8 | వెల : 2/-

## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575


### జూన్ 2న రాజీవ్ యువవికాస లబ్ధిదారులకు
## సాంక్షన్ లెటర్ల పంపిణీ

- జాబితా మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటి సిఎం భట్టి ఆదేశం

రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల ని ఆయన అన్నారు. బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.



03



## పంట నష్ట పరిహారం విడుదల


- 51,528 ఎకరాలకు రూ.51.52 కోట్లు
- త్వరలో 41,361 మంది రైతు ఖాతాల్లో జమ : మంత్రి తుమ్మల


03

### కొవిడ్ మళ్లీ పెరగడానికి
## కారణమేంటీ?
### ఆందోళన అవసరమా?

02

దేశంలో కొవిడ్ కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. మంగళవారం రాత్రి నాటికి దేశంలో 1010 క్రియాశీల కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం ఇదివరకే వెల్లడించింది. ఇతర దేశాలతో పోలిస్తే.. మన దగ్గర వైరస్ వ్యాప్తి తక్కువగానే ఉన్నప్పటికీ జాగ్రత్తగా ఉండాలని వైద్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## రైతులకు కేంద్రం శుభవార్త

- వరి తదితర పంటలకు మద్దతు ధరల పెంపు
- వరిపై 69 రూపాయలు పెంచుతూ నిర్ణయం

07





## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్

### ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులకు మోసం

### కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు

- గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం చేశారు
- నియామక పత్రాలు ఇద్దామనుకునేలోపు కోర్టుల్లో కేసులు వేసి.. వారి నోటికాడ కూడు లాగేశారు
- కాంగ్రెస్ వచ్చాక 15 నెలల్లో 55 వేల ఉద్యోగాల భర్తీ
- బిఆర్ఎస్ నేతలు కనిపిస్తే ఎక్కడిక్కడ నిలదీయండి
- చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని హితవు
- సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 28 :
గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని, ఉద్యోగాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ఇంట్లో ఉద్యోగాలు వస్తే చాలనే ధోరణిలో నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారు. మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది.

మిగతా 2 లో

### హైకోర్టు సీజేగా
## జస్టిస్ ఎకె.సింగ్
### త్రిపుర నుంచి బదిలీ

- ఆయన స్థానంలో జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు
- మద్రాస్ హైకోర్టుకు తెలంగాణ నుంచి జస్టిస్ టి.వినోద్‌కుమార్
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు



న్యూఢిల్లీ : తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్(ఎ.కె.సింగ్)ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తున్న ఆయనను తెలంగాణకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొలీజియం ఈ నెల 26న నిర్వహించిన తొలి సమావేశంలోనే మొత్తం 34 మంది న్యాయమూర్తులపై నిర్ణయం తీసుకొంది. జస్టిస్ అపరేష్ కుమార్ మాతృ హైకోర్టు ఝార్ఖండ్. తెలంగాణ హైకోర్టు పూర్వ సీజే జస్టిస్ ఆలోక్ అరాధే ఈ ఏడాది జనవరిలో బాంబే హైకోర్టుకు బదిలీ కావడంతో ఆ స్థానాన్ని జస్టిస్ అపరేష్ కుమార్‌తో భర్తీ చేయనున్నారు. 1965 జులై 7న డాక్టర్ రామ్‌గోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధాసింగ్ దంపతుల కుమారుడు జస్టిస్ అపరేష్ కుమార్. ఆయన కుటుంబంలోని పలువురు న్యాయవ్యవస్థలో పనిచేసిన వారే. ఆయన తల్లి వైపు ముత్తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు 6వ ప్రధాన న్యాయమూర్తిగా... తాత శంభూప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా...

మిగతా 2 లో

02

### టాప్-10లో గోల్కొండ, చార్మినార్ గర్వకారణం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



## కేసీఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

కాళేశ్వరంపై లోతుగా చర్చించిన నేతలు

03

## సెప్టిక్ ట్యాంక్‌లో బంగారం కోసం గాలింపు..

06

ఊపిరాడక నలుగురి మృతి




## నష్టాల్లో ముగిసిన సూచీలు..

రాణించిన ఎల్ఐసీ షేర్లు

11

### దేశంలో తొలి ప్రైవేట్ హెలికాప్టర్
## తయారీ కేంద్రం కర్ణాటకలో..



06

### టికెట్ల కోసం హెచ్‌సీఏ
## సెక్రటరీ బెదిరింపులు

- హెచ్ సీఏ వర్సెస్ సన్ రైజర్స్ వివాదం
- అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తి

07

సన్ రైజర్స్ హైదరాబాద్, హెచ్ సీఏ జట్ల మధ్య జరిగిన వివాదం మరో మలుపు తిరిగింది. ఈ వివాదంపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజిలెన్స్ విచారణలో విస్తుపోయే నిజాలు తెలిశా యి. హెచ్‌సీఏ అక్రమాలపై సంచలన విషయాలు బయటపడ్డాయని సమాచారం.

### అది ఎన్డీఎస్ఏ నివేదిక కాదు
## ఎన్డీయే నివేదిక

- కేసీఆర్‌కు పేరు రావడం ఇష్టంలేకే కుట్రలు
- ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆరోపణలు

04



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# టాప్-10లో గోల్కొండ, చార్మినార్ గర్వకారణం

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్:** దేశంలోనే టాప్-10 అత్యధిక సందర్శనీయ కట్టడాల్లో రాష్ట్రంలోని గోల్కొండ కోట, చార్మినార్ కట్టడాలు ఉండటం ఎంతో గర్వకారణమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో దేశంలో ఎక్కువ మంది సందర్శించిన చారిత్రక కట్టడాల జాబితాను ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) విడుదల చేసింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ఎక్స్‌లో.. 'ఈ రెండు కట్టడాలు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షిస్తూ తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. మన చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుందాం.. ఆవిష్కరిద్దాం' అని పేర్కొన్నారు. వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణతో పాటు దేశ రైతాంగానికి ఎంతగానో మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# హైకోర్టు సీజేగా జస్టిస్ ఎ.కె.సింగ్

(మొదటిపేజీ తరువాయి)

మామలు జస్టిస్ బిశ్వేశ్వర్‌ప్రసాద్ సింగ్ 2001-07 మధ్య, జస్టిస్ శివకీర్తిసింగ్ 2013-16 మధ్య సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సేవలందించారు. జస్టిస్ అపరేష్ కుమార్ దిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, ఎల్ఎల్‌బీ డిగ్రీ తీసుకున్నారు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని 2000 వరకు పట్నా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2001 నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యేంత వరకూ ఝార్ఖండ్ హైకోర్టులో న్యాయవాద వృత్తిని కొనసాగించారు. రాజ్యాంగం, సివిల్, క్రిమినల్, సర్వీస్, ఆర్బిట్రేషన్, లేబర్ కేసుల్లో న్యాయవాదిగా విశేషానుభవం గడించారు. 2012 జనవరి 24న ఝార్ఖండ్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014 జనవరి 16న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2022 డిసెంబరు 20 నుంచి 2023 ఫిబ్రవరి 19 వరకు ఝార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. 2023 ఏప్రిల్ 17న పదోన్నతిపై త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఇప్పుడు తెలంగాణ హైకోర్టు సీజేగా రానున్నారు.



# చేనేత కళాకారుల పనితీరు అద్భుతం

## విదేశీ పర్యాటకుల బృందం ప్రశంసలు

**భూదాన్‌పోచంపల్లి:** చేనేత కళాకారులు మగ్గంపై చీరలు తయారీ విధానం అద్భుతంగా ఉందని విదేశీ పర్యాటకుల బృందం సభ్యులు ప్రశంసించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని గ్రామీణ పర్యాటక కేంద్రాన్ని బుధవారం విదేశీ పాత్రికేయ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామీణ పర్యాటక కేంద్రంలో చీరల తయారీ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. చేనేత కళాకారుల పనితనంపై ప్రశంసలు కురిపించారు. అనంతరం కళాపునర్వీ కేంద్రాన్ని సందర్శించి చేనేత కార్మికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఆఫ్రికా ఖండంలోని 15 దేశాలకు చెందిన 25 మంది పాత్రికేయ ప్రతినిధుల బృందం భారతదేశ పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో శేఖర్‌రెడ్డి, పోచంపల్లి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, చేనేత జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



# మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించండి

## మీనాక్షి నటరాజన్‌కు ఆ సామాజికవర్గ ఎమ్మెల్యేల వినతి

**హైదరాబాద్:** మంత్రివర్గంలో తమ సామాజిక వర్గానికి చోటు కల్పించాలని కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కోరారు. ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ధర్మపురి), కవ్వంపల్లి సత్యనారాయణ (మానకొండూరు), మందుల సామేల్ (తుంగతుర్తి), లక్ష్మీకాంతరావు (జుక్కల్), కాలె యాదయ్య (చేవెళ్ల) బుధవారం హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మాదిగ జనాభా 30 లక్షలు ఉంది కానీ, మంత్రివర్గంలో సరైన ప్రాధాన్యం కల్పించలేదని చెప్పారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని, తమలో ఎవరికి అవకాశం కల్పించినా అభ్యంతరం లేదని తెలిపారు. మీనాక్షి నటరాజన్ స్పందిస్తూ.. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ తన పరిధిలోని అంశం కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిధిలోని విషయమన్నారు. అయినా మీ వినతిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మాట్లాడి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం లక్ష్మణ్, సామేల్, సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇచ్చారు. మాకున్న హక్కు కోసం కొట్లాడుతున్నాం. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉప సంఘం ఛైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. గురువారం దిల్లీ వెళ్లి అధిష్ఠానం పెద్దలనూ కలుస్తాం' అని చెప్పారు. విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు మందుల సామేల్ స్పందిస్తూ.. దామోదర్ రాజనర్సింహ సీనియర్ నాయకులు, ఆయనకు ఏ కోటాలో మంత్రి పదవి వచ్చిందో తమకు అవసరం లేదన్నారు. ఆయనతో తమకు కొట్లాట లేదని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కూడా ఎమ్మెల్యేలు కలిసి మంత్రివర్గంలో స్థానం కోసం వినతిపత్రమిచ్చారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

పదేళ్లు అధికారంలో ఉన్నవారు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయకుండా వారి కుటుంబ సభ్యుల ఉద్యోగాలకే ప్రాధాన్యమిచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎంపీగా ఓడిపోయిన ఆరు నెలలకే ఎమ్మెల్సీ ఉద్యోగం ఇచ్చారని, గ్రూప్-1, 2, డీఎస్సీ నోటిఫికేషన్లు వేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు. తాము అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలను ఇచ్చామని, ప్రైవేటు, కార్పొరేటు సంస్థల్లో లక్షమందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. కిందటి సంవత్సరం ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో చదివి ప్రఖ్యాత విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్, మెడికల్ తదితర విభాగాల్లో సీట్లు పొందిన విద్యార్థులకు బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ముఖ్యమంత్రి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. "అప్పటి ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు ప్రకటించండని నిరుద్యోగులు ఆందోళన చేస్తే వివిధ స్కీముల ద్వారా రుణాలిస్తాం. తీసుకోండంటూ సలహా ఇచ్చారు. డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన వారు చెప్పులు కుట్టాలా? చేపలు పట్టాలా? ఎస్టీ యువకులను పందులను పెంచండంటూ సలహాలిచ్చారు. గ్రూప్-1కు ఎంపికైన వారికి నియామక పత్రాలు ఇద్దామనుకునేలోపు నోటికాడ కూడు లాగేసినట్టు కోర్టుల్లో కేసులు వేయించారు. వారిని నిలదీయండి. వరుసగా ఉద్యోగాల నోటిఫికేషన్లను విడుదల చేస్తే అభ్యర్థులు పరీక్షలు రాస్తారు. ఉద్యోగాలు రానివారు ప్రత్యామ్నాయాలను ఎంచుకుంటారు. నోటిఫికేషన్లతో మభ్యపెడితే వారి సమయం వృథా అవుతుంది.. వయస్సు పెరుగుతుంది.. సమయం వృథా కాకుండా ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు చేపట్టాం" అని సీఎం వివరించారు.

### ఆకర్షణలవైపు మళ్లొద్దు.. పదేళ్లు కష్టపడండి

"జీవితంలో మీరు తొలిమెట్టు ఎక్కుతున్నారు. చదువుకోకుండా పక్కదారి పట్టించే ప్రలోభాలుంటాయి. వాటికి లోనుకాకుండా కష్టపడి కెరీర్‌లో రాణించండి. పదేళ్లు గట్టిగా నిలబడితే చాలు. ఇంజినీర్లు, డాక్టర్లు, ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులవుతారు. ఆకర్షణల్లో పడితే అంతే.. జీవితాంతం మీరు, మీ తల్లిదండ్రులు బాధపడతారు. కష్టపడండి..



మీలో అపారమైన ప్రతిభ, ఆత్మవిశ్వాసాలున్నాయి" అని సీఎం అన్నారు. ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు వేర్వేరు గురుకులాలకు బదులుగా... ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. "సమీకృత గురుకుల పాఠశాలల పేరుతో రూ.25 వేల కోట్లు వృథా చేస్తున్నారంటూ ఓ రాజకీయ పార్టీకి చెందిన పత్రిక విమర్శలు చేసింది. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు వారు సంక్షేమాన్ని చిన్నచూపు చూశారు. ఇప్పుడు మేము సంక్షేమాన్ని మరో స్థాయికి తీసుకెళ్తున్నాం" అని సీఎం రేవంత్ వివరించారు.

### ఇంజినీర్లు, వైద్యులు, సివిల్ సర్వెంట్లు..

"ఎస్సీ గురుకులాల్లో చదువుకున్న పిల్లలు ఐఐటీలు, ఎన్ఐటీలు, వైద్యకళాశాలల్లో ప్రవేశాలు పొంది ఇంజినీర్లు, వైద్యులుగా వృత్తిని ఎంచుకోవడం సంతోషంగా ఉంది. కొందరు సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకుని రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వండి. మీరు దేశ, విదేశాల్లో ఎక్కడున్నా మీ గ్రామాల వారు, మీ తల్లిదండ్రులు ఎప్పటికీ మిమ్మల్ని మర్చిపోరు. విద్యకున్నంత శక్తి అది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చదువు, ప్రతిభ కారణంగానే రాజ్యాంగ నిర్మాతగా ఎదిగారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీలు కడియం కావ్య, డాక్టర్ మల్లు రవిలు వారి కులం కారణంగా ఆ పదవుల్లోకి రాలేదు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన ప్రతిభతోనే ఆర్థికశాఖను సులువుగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి చదువే ఏకైక మార్గమంటూ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి వినూత్న విధానాలను ప్రతిపాదిస్తున్నారు. వీరితో పాటు మరెందరినో స్ఫూర్తిగా తీసుకుని ఆకాశమే హద్దుగా ఎదగండి" అని సీఎం రేవంత్ ఉద్బోధించారు.

## గత ప్రభుత్వంలో వసతి గృహాలంటే ఫంక్షన్‌హాళ్లు, రైసు మిల్లులే: భట్టి

"బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం కృషి చేశామంటూ గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంది.. పదుల సంఖ్యలో సంక్షేమ గృహాలను ప్రారంభించామంటూ ఘనంగా ప్రకటించింది. సంక్షేమ వసతి గృహాలను ఫంక్షన్ హాళ్లు, రైసు మిల్లులు, మూతపడిన ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. మేం రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి రూ.40,232 కోట్లు కేటాయించాం. ఇవేమీ గత పాలకులకు అర్థం కావు. రూ.7.5 లక్షల కోట్ల అప్పులు చేయడమే వారికి తెలుసు" అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు జి.వినోద్, కాలె యాదయ్య, వంశీకృష్ణ, మందుల సామేల్, నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, విప్ అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(ఎస్సీ అభివృద్ధి) ఎన్.శ్రీధర్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొన్నారు.

# మూడు బ్యారేజీలకు తొమ్మిది రకాల పరీక్షలు

## వాటి పూర్తికి ఏడాది నుంచి 18 నెలలు పట్టే అవకాశం

## నీటిపారుదల శాఖకు సూచించిన సీడబ్ల్యూపీఆర్ఎస్



**హైదరాబాద్:** నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) సిఫార్సుల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో పరీక్షలు చేయడానికి ఏడాది వరకు సమయం పడుతుందని పుణెలోని సెంటర్ ఫర్ వాటర్ అండ్ పవర్ రీసెర్చి సెంటర్(సీడబ్ల్యూపీఆర్ఎస్) తెలిపింది. ఒక పరీక్షకు 12 నెలల నుంచి 18 నెలల సమయం పట్టే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు చేయాల్సిన పరీక్షలు, ఒక్కో దానికి పట్టే సమయం, వాటికయ్యే ఖర్చుల వివరాలను నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఓఅండ్ఎం)కు నివేదించింది. ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఆధారంగా చేయాల్సిన పరీక్షలు, వ్యయం వివరాలతో ప్రతిపాదనలు పంపాలని సీడబ్ల్యూసీఆర్ఎస్‌ను నీటిపారుదల శాఖ కోరింది. ఎన్డీఎస్ఏ నివేదికను పరిశీలించిన సీడబ్ల్యూపీఆర్ఎస్ తొమ్మిది రకాల పరీక్షలను సూచించింది. వాటిలో... "కాంక్రీటు స్ట్రక్చర్ ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయాలి. దాని సామర్థ్యాన్ని పరీక్షించాలి. మెటల్ గేట్ల మందాన్ని కొలవాలి. నీటి సీపేజీని తెలుసుకోవడానికి జియో టెక్నికల్ అధ్యయనం చేయాలి. రెండు పియర్స్ మధ్యలో నీటి ప్రవాహం వెళ్లే 'బే' ప్రాంతంలో త్రీడీ స్ట్రెస్ ఎనాలసిస్ చేయాలి. బ్యారేజీ పటిష్ఠతను అంచనా వేయాలి. పారలెల్ సీస్మిక్ పరీక్ష నిర్వహించాలి. రాఫ్ట్ దిగువన పడిన గుంతలను అంచనా వేయడానికి జియో ఫిజికల్ స్టడీస్ చేయాలి. సీపేజీ ఎక్కడి నుంచి ఉందో తెలుసుకోవాలి" అని సూచించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఈ పరీక్షలన్నీ చేయాల్సి ఉంటుంది. ఇందులో మూడు పరీక్షలు మాత్రం మూడు నెలల్లో, రెండు పరీక్షలు ఆరు నెలల్లో పూర్తవుతాయని, మిగిలిన వాటికి 12 నెలలు పడుతుందని, పారలెల్ సీస్మిక్ పరీక్షకు 12 నుంచి 18 నెలల సమయం పడుతుందని పేర్కొంది. ఈ పరీక్షలకు అంచనా వేసిన మొత్తం చెల్లించిన తర్వాత సీడబ్ల్యూపీఆర్ఎస్ పని ప్రారంభించనుంది.


5 రకాల వైఫల్యాలతో మాకు సంబంధం లేదు: ఎల్అండ్‌టీ

ఎన్డీఎస్ఏ మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి ఆరు కారణాలను పేర్కొందని, ఇందులో ఐదింటితో తమకు సంబంధం లేదని గుత్తేదారు సంస్థ ఎల్అండ్‌టీ-పీఈఎస్ పేర్కొంది. డిజైన్స్‌కు జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ తగినంతగా లేకపోవడం, ఈ కారణంగా భూభౌతిక పరిస్థితులను సరిగా అంచనా వేయలేకపోవడం, టీఎస్ ఇంజినీరింగ్ రీసెర్చి ల్యాబొరేటరీ చేసిన మోడల్ స్టడీస్‌లో లోపాలు, హైడ్రాలిక్ స్ట్రక్చరల్ డిజైన్స్ ప్రత్యేకించి ఎనర్జీ డిసిపేషన్(గేట్ల నుంచి నీరు కిందకు దూకే వేగం) అంచనా తగినంతగా లేకపోవడం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో లోపాలు, డ్యాం సేఫ్టీ యాక్టు-2021కు తగ్గట్లుగా నిర్వహణ లేకపోవడానికి తాము బాధ్యులం కాదని పేర్కొంది. క్వాలిటీ కంట్రోల్ సరిగా లేకపోవడం అనే అంశంపై మాత్రం ఎన్డీఎస్ఏ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తాము సంబంధిత రిపోర్టులన్నీ ఇచ్చామని వెల్లడించింది. అయితే ఈ సమాధానాల తర్వాతనే ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చింది. దీంతోపాటు ముందస్తుగా గ్రౌటింగ్ చేయడంతోనే భూమి వాస్తవ పరిస్థితిని, స్ట్రక్చర్ పటిష్ఠతను అంచనా వేయలేకపోయామని ఎన్డీఎస్ఏ నివేదిక పేర్కొందని, బ్యారేజీ ఎగువన, దిగువన ప్లింత్ శ్లాబ్‌పైన గ్రౌటింగ్ చేయడంతో సీకెంట్ పైల్ పరిస్థితి మారిపోయిందని, దీనివల్ల కటాఫ్‌ల వాస్తవ పరిస్థితిని అంచనా వేయలేకపోయామని కూడా నివేదిక పేర్కొందంటూ వెల్లడించింది. అయితే ఓఅండ్ఎం సమయంలో బ్యారేజీలో తలెత్తిన సమస్యల గురించి ఇంజినీర్లు లేఖలు రాసినా గుత్తేదారు సంస్థ స్పందించలేదని నీటిపారుదల శాఖ రాసిన విషయమై మాత్రం ఎల్అండ్‌టీ స్పందించలేదు.

# తెలంగాణలో పెట్టుబడులకు సహకరించండి

## యూకే తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో కేటీఆర్


**హైదరాబాద్:** అధికారంలో ఉన్నా.. లేకున్నా తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తూనే ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. యూకే పర్యటనలో ఉన్న కేటీఆర్‌ను పలువురు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యూకే తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే ప్రతి ఒక్కరికీ సహకరించాలని సమావేశానికి హాజరైన వారిని కేటీఆర్ కోరారు. అనంతరం తెలంగాణ ప్రవాసులతో కేటీఆర్ భేటీ అయ్యారు. త్వరలో యూకేలోనూ భారాస రజతోత్సవ




సంబురాలు నిర్వహిస్తామన్నారు. లండన్‌లో కేటీఆర్‌ను పీడీఎస్ఎల్ ప్రతినిధులు కలిసి తమ కంపెనీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.

# కొవిడ్ మళ్లీ పెరగడానికి కారణమేంటీ?

## ఆందోళన అవసరమా?



**హైదరాబాద్:** దేశంలో కొవిడ్ కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. మంగళవారం రాత్రి నాటికి దేశంలో 1010 క్రియాశీల కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. కొవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం ఇదివరకే వెల్లడించింది. ఇతర దేశాలతో పోలిస్తే.. మన దగ్గర వైరస్ వ్యాప్తి తక్కువగానే ఉన్నప్పటికీ జాగ్రత్తగా ఉండాలని వైద్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో కొవిడ్ కేసులు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. గతంలో ఇన్ఫెక్షన్లు సోకడం, టీకాలు వేసుకోవడం ద్వారా వచ్చిన రోగనిరోధక శక్తి క్షీణించడం కూడా ఒక కారణమని పేర్కొంటున్నారు. ఇమ్యూనిటీ క్షీణించడం ద్వారా వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులు తిరిగి వైరస్ బారిన పడే అవకాశం ఉండొచ్చని విశ్లేషిస్తున్నారు. అయితే, జేఎన్.1 ఉపరకమైన ఎన్‌బీ 1.8.1 వంటి కొత్త వేరియంట్లు బాధితులపై తీవ్రమైన ప్రభావం చూపినట్లు మాత్రం ప్రస్తుతానికి ఎలాంటి రుజువల్లేవు. ఇతర శ్వాసకోశ వ్యాధుల్లాగే కరోనా కూడా చల్లని, అధిక తేమతో కూడిన పరిస్థితుల్లో వేగంగా వ్యాప్తి చెందే లక్షణం కలిగినదే. దేశంలోని అనేక నగరాల్లో సీజనల్ ఫ్లూ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు పెరుగుతున్న వాతావరణం కూడా కరోనా వ్యాప్తికి అనుకూలంగా ఉన్నట్లు కనబడుతోంది. మరీ ముఖ్యంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో రుతుపవనాలు ముందుగానే రావడం వల్ల గాలిలో తేమ శాతం అధికంగా ఉండటం కూడా ఈ వైరస్ మళ్లీ వ్యాప్తి చెందడానికి కారణం కావొచ్చనే విశ్లేషణలూ వినబడుతున్నాయి. దీనికితోడు ప్రస్తుత పరిస్థితుల్లో కొవిడ్ టెస్టింగ్, జన్యుపరమైన నిఘా తగ్గడం వంటివీ మరో కీలకాంశమని పలు కథనాలు పేర్కొంటున్నాయి. కొవిడ్-19ను ఎండమిక్‌గా గుర్తించినప్పటి నుంచి సాధారణ పరీక్షలు, జన్యుశ్రేణిపై విశ్లేషణలు, పర్యవేక్షణ కొరవడిన నేపథ్యంలో ఈ వైరస్ మళ్లీ వ్యాపించడానికి కారణమని పలువురు విశ్లేషిస్తున్నారు. సింగపూర్, ఇతర ఆగ్నేయాసియా దేశాల్లో ఇటవల కేసులు పెరుగుతున్నాయి. మే మాసం తొలి రోజుల్లో సింగపూర్‌లో దాదాపు 30శాతం మేర ఇన్ఫెక్షన్లు పెరిగాయి. అయితే, భారత్‌లో మాత్రం కొవిడ్ వ్యాప్తి ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి పరిమితమైనట్లు కనబడుతోంది. దేశంలో ప్రస్తుతం ఉన్న క్రియాశీల కేసుల్లో ఒక్క కేరళలోనే దాదాపు 43శాతం ఉండగా.. మహారాష్ట్ర 21శాతంతో రెండో స్థానంలో, దిల్లీ, గుజరాత్, తమిళనాడు వరుసగా 10, 8, 7శాతాలతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. అయితే, ప్రపంచంలో కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతుండటంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం అప్రమత్తమైంది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న వేరియంట్‌లలో ఏదీ ఆందోళనకరమని నిర్ధారణ కాలేదు.

**జాగ్రత్తలు తీసుకోండి..** దేశంలో తాజా పరిణామాల నేపథ్యంలో కొవిడ్ వ్యాప్తిపై ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ వైరస్‌ను నియంత్రించేందుకు వైరస్ లక్షణాలు ఉన్నవారికి టెస్టులు పెంచాలని సూచించింది. అలాగే, 60 ఏళ్లు పైబడిన వారు, ఇప్పటికే పలు అనారోగ్యాలతో బాధపడుతున్న వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ రద్దీ ప్రదేశాల్లో మాస్కులు ధరించడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, కొవిడ్ లక్షణాలు ఏవైనా కనిపిస్తే స్వీయ నిర్బంధంలోకి వెళ్లడం వంటి నిబంధనలు పాటించాలని కోరుతున్నారు.

### కేరళలో ఆందోళనక పరిస్థితి లేదు.. మంత్రి వీణాజార్జ్

కేరళలో పరిస్థితిని సునిశితంగా గమనిస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణాజార్జ్ తెలిపారు. ప్రపంచ దేశాల్లో కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో.. సత్వరమే స్పందించి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎప్పటికప్పుడు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అన్ని జిల్లాల్లో కొవిడ్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించామన్నారు. కేరళలో ఎలాంటి ఆందోళనకర పరిస్థితి లేదన్న ఆమె.. ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మంగళవారం నాటికి రాష్ట్రంలో 519 యాక్టివ్ కేసులు ఉన్నాయని.. తీవ్ర తక్కువగానే ఉందని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారు కొంత మేరకు ఇబ్బంది పడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు కేరళలో మూడు మరణాలు సంభవించాయని మంత్రి పేర్కొన్నారు.

# జూన్ 2న రాజీవ్ యువవికాస లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ

- జాబితా మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటి సిఎం భట్టి ఆదేశం



**హైదరాబాద్, మే 28 :** రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు 6 వేల 250 కోట్లతో స్వయం ఉపాధి కల్పించ నున్నారని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతి యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తొడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దశల వారిగా జరిగే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు రాష్ట్ర జి.డి.పి. లో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన గులాంనబీ ఆజాద్

### రియాజ్ ఆస్పత్రిలో చికిత్స

**న్యూఢిల్లీ, మే 28 :** విదేశీ పర్యటనలో ఉన్న కేంద్ర మాజీమంత్రి గులాంనబీ ఆజాద్ అస్వస్థతకు గుర య్యారు. ఆయన బహ్రెయి న్‌లో అస్వస్థతకు గురికాగా రియాజ్‌ని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నరు. ప హల్గంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు భారత్ సిద్ధమైంది. ఈ మేరకు అన్ని పార్టీల నుంచి ఎంపిలను ఎంపిక చేసి.. విదేశీ పర్యటనకు పంపించింది. అయితే ఈ బృందం సభ్యుల్లో ఒకరైన జమ్ముకశ్మీర్ మాజీ సిఎం, డెమొక్రటిక్ ప్రోగ్రెసీవ్ ఆజాద్ పార్టీ చీఫ్, మాజీ ఎంపి గులాం నబీ ఆజాద్ కూడా ఉన్నారు. అయితే ఆయన బహ్రెయిన్ పర్యటనలో అస్వస్థతకి గురయ్యారు. ఈ విషయాన్ని ఈ బృందానికి నేతృత్వం వహి స్తున్న బిజెపి ఎంపి బైజయంత్ పాండా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆజాద్ ప్రస్తుతం రియాజ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలక డగానే ఉందని పేర్కొన్నారు. ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని.. కొన్ని -టె-స్టులు చేయాల్సి ఉందని తెలిపారు. సౌదీ పర్యటనలో ఉండగా.. ఆయన అనారోగ్యానికి గురి కావడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటివరకూ ఆయన సహకారంతో బహ్రెయిన్, కువైట్‌లో పర్యటనలు విజయవంతంగా జరిగాయని.. అల్జీరియా పర్యటనలో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

## 12 లక్షలు లంచం డిమాండ్

### ఆర్ఐ కృష్ణను అరెస్ట్ చేసిన ఎసిబి

**రంగారెడ్డి, మే 28 :** లంచం తీసుకుంటున్న అధికారులు ఎంత మందిని అరెస్ట్ చేసినా.. అవినీతి చేసే వాళ్లలో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. చిన్న పని పెద్ద పని అనే తేడా లేకుండా లంచం డిమాండ్ చేసే అధికారులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. తాజాగా అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో లంచగొండి అధికారి చిక్కాడు. పట్టాదార్ పాస్ పుస్తకంలో 7 గుంటల స్థలం నమోదుకు లంచం డిమాండ్ చేసిన ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణని అధికారులు అరెస్ట్ చేశారు. రూ.12లక్షలు ఇస్తే భూమిని పాస్‌బుక్‌లో నమోదు చేస్తానని బాధితుడిని కృష్ణ బెదిరించాడు. ఆర్ఐతో మాట్లాడిన కాల్ రికార్డులను బాధితులు ఎసిబి అధికారులకు ఇచ్చారు. దీంతో ఆర్ఐ కృష్ణను ఎసిబి అధికారులు అరెస్ట్ చేశారు.

## బాసర ఆర్జీయూకెటిలో నోటిఫికేషన్ విడుదల

**బాసర, మే 28 :** ఆర్జీయూకేటీ- బాసర, మహబూబ్ నగర్ సెంటర్ లలో ఆరు సంవత్సరాల సమీకృత విద్యా విధానంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించుటకు అడ్మిషన్ నోటిఫికేషన్ ను వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విడుదల చేశారు. గ్రామీణ పేద విద్యార్థులకు 2008వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పాటయిందని, తదనుగుణంగా ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యూ. ఆర్‌జియు కే టి. ఏసి. ఇన్ వెబ్ సైట్ ను సందర్శించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓయస్డి ప్రొఫెసర్ మురళీ దర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్ డాక్టర్ దేవరాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ విటల్, మంతపురి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీ పరార్

**జగిత్యాల, మే 28 :** పోలీసులను ఓ రిమాండ్ ఖైదీ బురడీ కొట్టించాడు. కోర్టు ఆవరణలో కుటుంబసభ్యులతో మాట్లాడుతూనే.. పోలీసుల కండ్లుగప్పి పరారయ్యాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబసభ్యులను వివరాలు అడిగి పలు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. కస్టడీ నుంచి ఖైదీ తప్పించుకోవడం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా చర్చనీయాం శంగా మారింది. జగిత్యాల సబ్ జైలులో పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జున్ను ప్రసాద్ రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన కేసుల్లో అరెస్ట్ అయి జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇటీవలే అతడిపై కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. జగిత్యాల సబ్ జైలులో ఉన్న ప్రసాద్‌ను విచారణలో భాగంగా మంగళవారం కొడిమ్యాల పోలీసులు పీటీ- వారెంట్‌తో తీసుకెళ్లి జగిత్యాల కోర్టులో హాజరుపర్చారు.

# పంట నష్ట పరిహారం విడుదల

- 51,528 ఎకరాలకు రూ.51.52 కోట్లు
- త్వరలో 41,361 మంది రైతు ఖాతాల్లో జమ : మంత్రి తుమ్మల



**హైదరాబాద్:** తెలంగాణలో గత రెండు నెలల్లో అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.51.52 కోట్ల పరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వరి 36,424 ఎకరాలు, మొక్కజొన్న 3,266, జొన్న 470, ఉద్యాన పంటలు 6,589, పత్తి 4,753 ఇతర పంటలతో కలిపి మొత్తం 29 జిల్లాల్లో 51,528 ఎకరాలలో పంట నష్టం సంభవించిందని అధికారులు గుర్తించారు. 41,361 మంది రైతులు తమ పంటలను కోల్పోయారని ప్రభుత్వానికి నివేదించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పంట నష్టపరిహారం నిధులు విడుదలయ్యాయని, వీటిని సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకొని త్వరలోనే బాధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ నెలలో జరిగిన పంట నష్టాలపైనా ఇప్పటికే నివేదిక సిద్ధంచేసి ఈ వారంలో ఆర్థికశాఖకు పంపించామని, వాటికి సంబంధించిన నిధులు త్వరలో మంజూరు అవుతాయని మంత్రి వెల్లడించారు.



## మాకు అండగా నిలిచిన సమాజానికి దక్కిన గౌరవం ఇది

### 'పద్మశ్రీ' అందుకున్న మందకృష్ణ మాదిగ

**ఢిల్లీ:** లక్ష్యం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తే గుర్తింపు దక్కుతుంది అనడానికి తనకు వచ్చిన పద్మశ్రీ పురస్కారమే నిదర్శనమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఇది మా జాతికి, ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి అండగా ఉన్న సమాజానికి దక్కిన గౌరవం అని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మద్దతుగా నిలిచిన కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, చేయూతనిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఇకముందు కూడా పోరాడుతాం" అని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.


## పని ప్రారంభించకుండా అంచనాలు పెంచడమే ప్రజాపాలన : హరీశ్‌రావు



**హైదరాబాద్:** 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పని ప్రారంభించకుండానే.. నిర్మాణ వ్యయ అంచనాలను గణనీయంగా పెంచడమే కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన' అని భారాస సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఇదంతా రూ.వేలకోట్లు దండుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న నాటకమని బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. "శంకుస్థాపన చేసింది లేదు. తట్టెడు మట్టి ఎత్తింది లేదు. నిర్మాణ వ్యయాన్ని కోట్లకు కోట్లు పెంచడం కాంగ్రెస్ పార్టీకే చెల్లింది. 2024 జులై 24న ఆదిలాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.80-100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తామని ప్రకటిస్తే..అదే సంవత్సరం అక్టోబరు 11న సీఎం రేవంత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో రూ.125 కోట్లతో ఈ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ నెల రెండో వారంలో వివిధ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు రూ.135- 150 కోట్లతో టెండర్లు ఖరారు చేశారు. ఈ నెల 27న 20 స్కూళ్ల నిర్మాణానికి రూ.4,000 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో96 జారీ చేశారు. అంటే ఏ పని మొదలు కాకుండానే ఒక్కో స్కూల్ అంచనాలను రూ.200 కోట్లకు పెంచారు" అని పేర్కొన్నారు.

# తమిళంలో నుంచే కన్నడ పుట్టింది

- కమలహాసన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కన్నడిగులు
- కమల్‌కు కన్నడ చరిత్ర తెలియదంటూ సిఎం సిద్ధరామయ్య విసుర్లు



**బెంగళూరు, మే 28 :** తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాను నటించిన థగ్‌లైఫ్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా జీవితం, నా కుటుంబం తమిళ భాష' అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై కన్నడిగులు మండిపడు తున్నారు. తాజాగా ఈ వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. ఈ మేరకు నటుడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదని పేర్కొన్నారు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియవంటూ ఎద్దేవా చేశారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్న) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.



## కేసీఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

### కాళేశ్వరంపై లోతుగా చర్చించిన నేతలు

**గజ్వేల్, మే 28 :** కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందిన నేపథ్యంలో ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మూడున్నర గంటలగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న కమిషన్ ఇచ్చిన నివేదిక, అందించిన నోటీసులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 5న కమిషన్ ముందు విచారణకు హాజరుకానున్నట్లు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేసీఆర్, ముందు జాగ్రత్తగా కమిషన్ వద్ద ఉత్పన్నమయ్యే ప్రశ్నలు, వాటికి ఇవ్వాల్సిన సమాధానాలపై హరీష్‌రావుతో సమాలోచనలు జరిపినట్లు- సమాచారం. విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న అంశాలు, ఎక్కడా లోపాలు జరిగాయన్న విషయాలపై పూర్తిగా ఆరా తీసినట్లు-, ఇది కాకుండా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏం సూచించింది? బ్యారేజీ కుంగడపై సాంకేతిక కారణాలు ఏమిటన్న దానిపై పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కమిషన్ ఎదుట హాజరైన కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లతో కేసీఆర్ ఫోన్ ద్వారా మాట్లాడినట్లు, కమిషన్ అడిగిన ప్రశ్నలు ఏమిటి? ఇంజనీర్లు ఇచ్చిన సమాధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై కూడా ఆయన చర్చించినట్లు సమాచారం. మొత్తంగా సమాధానాలు సిద్ధం చేసుకుని కమిషన్ ముందుకు హాజరయ్యేలా కెసిఆర్ సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

## 4కోట్ల విలువైన గంజాయి పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం, మే 28 :** తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా.. వీటి రవాణా మాత్రం ఆగడంలేదు. ఈజీ మనీకి అలవాటు పడ్డ వారు గంజాయిని రవాణా చేస్తున్నారు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. పక్కా సమాచారంతో బుధవారం జూలూరుపాడు మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి 8.30 క్వింటాళ్ల గంజాయి పట్టుకున్నారు. అనంతరం తొమ్మిది మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన గంజాయి ధర మార్కెట్ లో రూ.4 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లిఫ్టులో ఇరుక్కున్న కుమారుడు

### తట్టుకోలేక గుండెపోటుతో తండ్రి మృతి

**భోపాల్, మే 28 :** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. కుమారుడు లిఫ్ట్‌లోఇరుక్కుపోవడంతో తనని కాపాడుకోలేననే భయంతో తండ్రి గుండెపోటుతో మృతి చెందారు. భోపాల్‌లోని జత్కేడి ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రిషిరాజ్ భట్నాగర్(51) తన భార్య, పిల్లలతో నివసిస్తున్నారు. సోమవారం కుమారుడిని వెతుక్కుంటూ కిందకు వచ్చారు. కుమారుడు కనిపించడంతో అతన్ని ఇంటికి వెళ్లమని సూచించిగా.. ఎనిమిదేళ్ల పిల్లాడు లిఫ్ట్(ం÷బిష) ఎక్కాడు. వెంటనే పవర్‌కట్ కావడంతో లిఫ్ట్‌లో ఆ పిల్లాడు ఇరుక్కుపోయాడు. దీంతో రిషిరాజ్ తీవ్ర ఆందోళనకు గురి కావడంతో అయనకు గుండెపోటు వచ్చింది. కొన్ని నిమిషాల్లో పవర్ రావడంతో పిల్లాడు సురక్షితంగా బయటకు వచ్చాడు. అయితే అప్పటికే పడిపోయిన రిషిరాజ్‌ను అపార్ట్‌మెంట్ వాసులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రిషిరాజ్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు- నిర్ధారించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ

### దుండగులను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, మే 28 :** మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్‌లో మావోయిస్టు పేరుతో బెదిరింపు లేఖ కలకలం సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడి కుటు-ంబాన్ని లేఖలో లక్ష్యంగా చేసుకున్నారు. రూ.50 లక్షలు ఇవ్వకపోతే కూన రవీందర్‌గౌడ్ కుమారుడు కూన రాఘవేందర్ గౌడ్‌ను చంపుతామని అందులో పేర్కొన్నారు. రెండు ఇళ్లను బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి ముందు వస్తువులు ధ్వంసం చేసి అక్కడ లేఖను ఉంచారు. ఈ క్రమంలో జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టుల లేఖ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21న మావోయిస్టుల పేరుతో నిందితులు లేఖ రాశారు. వారిని కూన రాఘవేందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు, అతడి స్నేహితుడిగా గుర్తించారు. నిందితుల వద్ద నాటుబాంబులు, 3 సెల్‌ఫోన్లు, 2 బెదిరింపు లేఖలను స్వాధీనం చేసుకున్నారు. నాటుబాంబులను వారు విజయనగరంలో కొనుగోలు చేసినట్లు తెలిసింది. కారుపై ఎరుపు రంగు టవల్‌లో లేఖ పెట్టి వెళ్లిపోయారు. ఘటన ఈ నెల 21న జరిగినట్లు- రాఘవేందర్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో ఓ వ్యక్తి మాస్క్ ధరించి వచ్చినట్లు- గుర్తించారు. తాజాగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

## వివాహేతర సంబంధంతో ఆత్మహత్య

**గద్వాల, మే 28 :** వివాహేతర సంబంధం ఆత్మహత్యకు దారితీసింది. ఈ కారణంగా ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న సంఘటన జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలికి చెందిన మహిళ (32)కు భర్త, కుమార్తె ఉన్నారు. ఇదే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పుల్లన్నతో మహిళకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నెల 12న ఇద్దరూ గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కుమార్తెను చూడాలనిపించి మహిళ.. ఈనెల 25న గ్రామానికి వచ్చి ఇష్టపూర్వకంగానే అతనితో వెళ్లినట్లు- పోలీసుల ఎదుట చెప్పింది. దీంతో ఇద్దరినీ పోలీసులు ఇళ్లకు పంపించారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో 27న పుల్లన్న ఎలుకల మందు తాగడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయం తెలియడం, మరో వైపు భర్త కూడా తీవ్రంగా బాధపడుతుండటంతో మనస్తాపానికి గురైన మహిళ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు- ఎస్ఐ తెలిపారు.

# వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి!



వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వస్తున్నాయి. రైతులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల ను గమనిస్తున్నారు. కొత్త తరహా సేద్యానికి అలవాటు పడుతున్నారు. కేవలం వరిపైనే ఆధారపడకుండా కూరగాయలు, పళ్లతోటల పెంపకం,పాడిపశువుల పెంపకంపైనా శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులకు మరింత ఆసరా దక్కాలి. బ్యాంకులు కొర్రీలు లేకుండా రుణాలు ఇవ్వాలి. పంటలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు మారాలి. వారికి వ్యవసాయశాఖ పరంగా అన్ని సూచనలు, సలహాలు అందాలి. అన్నింటికిమించి బీమా సౌకర్యం అందించాలి. ఇలా చిన్నిచిన్న సాయాలుచేస్తే రైతాంగం మరింతగా కష్టపడి దేశ పురోభివృద్దిలో భాగస్వామ్యం కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు భారీగా పెరిగాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ముందునుంచి పంటల దిగుబడి పెరుగుతూ వస్తోంది. రైతులు చెమటోడ్చి పంటలు పండిస్తున్నా ఆర్థికంగా మాత్రం ఎదగడం లేదు. పంటలు బాగా పండాయనడానికి ధాన్యం రాశులే దీనికి నిదర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంతగా ధాన్యం దిగుబడి అయ్యిందో గమనించాలి. ఓ వైపు జోరుగా కొనుగోళ్లు జరుగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతులు ఆందోళనలకు దిగితున్నారు. ఉచిత విద్యుత్‌కు తోడుగా, అందుబాటులో నీరు ఉండడంతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి. తెలంగాణ కూడా ఇప్పుడు వ్యవసాయికంగా బాగా పురోగమించిందనే చెప్పాలి. మరోవైపు ధాన్యం దిగుబడిలో ఇప్పటికే అగ్రస్థానం లో నిలిచిందని సిఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం నీళు లేకున్నా పంటల దిగుబడి పెరిగిందని మంత్రులు అంటున్నారు. వరిదిగుబడి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిం దని భారత ఆహార సంస్థ గతంలో చేసిన ప్రకటన తెలంగాణ వ్యవసాయరంగం పురోగమిస్తోందనడానికి సంకేతం. వ్యవసాయ రంగంలో విప్లవం సాధించిన ఘనత ఎలా ఉన్నా, ధాన్యాగారంగా మారడానికి అన్నదాతల కష్టాలను అభినందిం చాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనడం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉన్నది. కృష్ణా, గోదావరి, మూసీ నదీ జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నది.

గిరాకీ ఉన్న పంటల్నే పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్‌కు తేవడం.. నియంత్రిత వ్యవసాయం లక్ష్యం. వ్యవసాయానికి పెట్టుబడి సాయం మొదలు విత్తనాల్లో సబ్సిడీ, ఎరువుల్లో రాయితీ సమకూర్చుతున్న ప్రభుత్వం... రైతులు మూస విధానం వీడి మంచి ఆదాయం పొందేలా మేధోమధనం జరిపింది. ఈ మేరకు జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడించేలా ప్రణాళిక రూపొందిం చింది. ఒకే రకమైన పంటలసాగుతో ధరలు తగ్గి రైతులు నష్ట పోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలకు రైతులు కూడా మొగ్గుచూపు తున్నారు. ఇక అవసరమున్న పంటలను పండించాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగం బహుముఖంగా అభివృద్ధి చెందనుంది. కరోనా కాలం కష్ట సమయంలో ధాన్యాగారంగా,యావద్దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. ఈ విజయం వ్యవసాయరంగ పురోభివృద్దిలో సాధించిన మైలురాయిగా చూడాలి. అయితే ఉభయ రాష్ట్రాల్లో కరువులు, వలసలతో కొండంత కష్టాలతో కుమిలి పోయిన అన్నదాతల జీవితాలు మాత్రం గట్టెక్కడం లేదు. రైతుభరోసా పెట్టుబడి సాయంతో పాటు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా అవుతున్నా అనేక కష్టాలను ఈదాల్సి వస్తోంది. అన్నింటికి మించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కక పోవడం, సకాలంలో కొనుగోళ్లు చేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. యాసంగి దిగుబడిలో మునుపెన్నడూ ఎరుగని రీతిలో వరి దిగుబడి సాధించి రైతులు రికార్డు సృష్టించారు. ఆ తరువాత పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనడంతో అన్నదాతలకు భరోసా దక్కింది. తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం విలువ పదివేల కోట్ల రూపాయల పై మాటే అని తెలుస్తోంది.

యాసంగిలో పండిన వరిధాన్యం సేకరణలో జాతీయస్థాయిలో తెలంగాణది కీలక భాగస్వామ్యమని ఎఫ్‌సిఐ పేర్కొన్నది. ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించినట్లు ప్రకటించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్ అన్నారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండని కూడా సూచించారు. ఒక్క నిముషం వృథా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టాలి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. అప్పుడే కొన్ని సమస్యలయినా తీరుతాయి. రైతులకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం, కూలీల సమస్యను అధిగమించడం కూడా ముఖ్యం.

# ఆర్టీసీని గట్టెక్కించడం అందరి బాధ్యత

## కార్మికులను కాపాడుకోవడమూ ముఖ్యమే



**హైదరాబాద్, మే 28 :** నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించడం కోసం ఎండి సజ్జన్నార్ రకరకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే కరిమింగిన వెలగపండులా ఆర్టీసీ రోజురోజుకూ కుదేలవుతోంది. ప్రస్తుత నష్టాలను చార్జీల ద్వారా గట్టెక్కించడం అసాధ్యం. దీనికితోడు పెరుగుతున్న డీజిల్ ధరలు కూడా ఆర్టీసికి గుదిబండగా మారాయి. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ మరింత నష్టాల్లోకి దిగజారింది. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో వెనకాడరాదు. అదేపనిగా టిక్కెట్ ధరలు పెంచినా గట్టెక్కించడం అసాధ్యం. ఆర్టీసిని లాభాల్లోకి తీసుకుని రావడంతో పాటు, కార్మికులకు కాపాడుకునే బాద్యత యాజమాన్యంపై ఉంది. అయితే ఎండిగా సజ్జన్నార్ బాధ్యతలు తీసుకున్న తరవాత గతంకన్నా మేలనే చెప్పాలి. అనేక విధాలుగా ఆర్టీసీని గట్టెక్కించే చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా చిన్న అవకాశం వదలకుండా కృషి చేస్తున్నారు. ఆర్టీసీని రక్షించుకునే ప్రయత్నంలో కార్మికుల జీవితాలకు కూడా భరోసా కల్పించి ముందుకు సాగాల్సి ఉంది. ప్రజలకు ఉత్తమ, మెరుగైన రవాణా సౌకర్యాలు, బస్సుల్లో అధికరద్దీని తగ్గించడం, అనుకూలమైన, అందుబాటు టికెట్ ధరలు, ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సాగుతున్నది. ఆర్టీసీ రక్షణతో పాటు,కార్మికులు పక్షాన కూడా ఆలోచనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. వాటిని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నిస్తున్నాయి. అనేక సంక్షేమ పథకాల అమలు వల్ల ఎప్పటికప్పుడు నిండుకుంటున్న ఖజానాతోపాటు, ఆర్థిక మాంద్యం దెబ్బతో బడ్జెట్ లెక్కలను నేల మీదకు దించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదనేది ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం. మారిన పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టుకు పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్న వారు మినహా మిగిలిన జనం పెద్దగా ఇబ్బంది పడటంలేదు. ఆర్టీసీని కూడా ఏదో రకంగా గట్టెక్కించి లాభాల్లోకిరాకున్నానస్టాలు రాకుండా చూడగలగాలి. ఇది ఏ ఒక్కరిద్దరి సమస్యనో కాదు. 50వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం. నిబద్ధతతో పని చేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్ తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు- పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన మరో 537 మందికి ఉద్యోగాలు ఇచ్చామని వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య టెస్టుల ఫలితంగా 726 మంది ఉద్యోగులకు, 184 మంది ఉద్యోగుల జీవిత భాగస్వాములను ప్రాణాప్రాయం నుంచి సంస్థ కాపాడిందన్నారు. అలాగే, మహాలక్ష్మి పథకం అమలుతో సిబ్బందిలో పెరిగిన పని భారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుంటే.. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో 3036 రెగ్యూలర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని.. సాంకేతిక కారణాల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియమాకాలు కచ్చితంగా జరుగుతాయి.. అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా.. ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని వీసీ సజ్జనార్ చెప్పారు. అలాగే, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వీసీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగులు, సంస్థ ప్రయోజనాలే ఉంటాయో తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవన్నారు. ప్రతి నిర్ణయం చాలా పారదర్శకంగా, సంస్థ నియమ నిబంధనలకు లోబడే ఉంటుందని ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# అస్తవ్యస్తంగా ముంబై డ్రైనేజీ వ్యవస్థ

- భారీ వర్షం పడితే సముద్రం తలపించేలా వీధులు
- పాలకులు చిత్తశుద్ధి లోపంతో ప్రజలకు అవస్థలు



**ముంబై, మే 28 :** ముంబై మహానగరంలో ఏటా వర్షాలు వస్తే నరకం చూడాల్సిందే. చిన్నపాటి వర్షం అయినా చిగురుటాకులా వణికిపోతుంది. అలాంటిది సాధారణం కన్నా రెండు వారాల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు 107 ఏళ్ల నాటి రికార్డులను చెరిపివేస్తూ కురిపించిన కుండపోతతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలమైంది. ఎంతటి మహానగరమైనా వరుణుడు కన్నెర్ర చేస్తే నడిసంద్రంలా మారుతున్న తీరు మన పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలిచిపోతోంది. గతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ... ఇలా ఎన్నో ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. 2021లో ఇదే ముంబై నగరం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై నిపుణుల కమిటీలు పలు సిఫార్సులు చేశాయి. కానీ, పాలకులు వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేయడం వల్లనే ఇటువంటి నష్టాలు తిరిగి సంభవిస్తున్న పరిస్థితి. ప్రధానంగా ఆక్రమణలు, డ్రైనేజీ వ్యవస్థ అల్లకల్లోలం చేస్తున్నాయి. ఆర్థిక నగరానికి ఆదాయం ఉన్నా దానిని బాగు చేసే ఆలోచనలో పాలకులు లేరు. ఎవరు అధికారంలో ఉన్న ముంబై అతలాకుతలం కావాల్సిందే. మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపకపోవడం నగరాలు, పట్టణాలు నీట మునకకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజిలు తదితర మౌలిక వసతులు కల్పించి, నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటి-కై-నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భుజంభుజం కలపాలి. ప్రకృతికి అనుకూలంగా ఉండే ప్రాజెక్టులను రూపొందించడం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, నూతన నగరాల నిర్మాణంలో, ఉన్న నగరాల విస్తరణలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు అత్యావశ్యకం.ఈ ఏడాది 16 రోజులు ముందుగానే రావడం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారి. మునిగిన రహదారులు, భూగర్భ మెట్రో లైన్లు, రైల్వే స్టేషన్లతో నగర జీవనం స్తంభించిపోయింది. రోడ్డు, రైలు, విమాన సర్వీసులకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్లో అలర్ట్‌ను జారీచేయడం ద్వారా ఈ స్థాయి వర్షాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ విఫలమైనట్టే! గతంలో వయనాడ్‌లో భారీ వర్షాలతో కొండచరియల బీభత్స సమయంలోనూ వాతావరణ శాఖ వైఫల్యం మనమెరిగిందే! ఇంతటి భారీ వర్షపాతానికి సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన కారణమని ఐఎండి చెబుతోంది. ధారాపాతంగా రాత్రంతా కురిసిన 200 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం ముంబైని ముంచెత్తింది. పొరుగున ఉన్న కొలాబాలో సోమవారం 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం 1918 నాటి రికార్డు 279.4 మిల్లీమీటర్లను తిరగరాసింది. దక్షిణ ముంబైలో 13 గంటల్లోనే 252 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు ప్రభావం చూపాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన పది రోజులకు మహారాష్ట్రకు రావాల్సి ఉండగా 24 గంటల్లోనే ఇక్కడ ప్రతాపం చూపాయి. సాధారణంగా ఏటా జూన్ 11న ముంబైలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. వాతావరణ శాఖ మరింత అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నష్టాల తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలుకు అమెరికాలాంటి అగ్రరాజ్యాలు చేతులెత్తేయడం, పర్యావరణ పరిరక్షణకు చేసిన తీర్మానాల అమలుకు శ్రద్ధ చూపని ధనిక దేశాల తీరు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను భారీగా పెంచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా మారిపోతున్నాయి. ఏటా అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతూనే ఉన్నాయని కేంద్రప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఐదేళ్ల క్రితమే అంచనా వేసింది. కుండపోత వర్షాలు కురిసినా చెరువులు, వాగులు, వంకలు లాంటి సహజ సిద్ధమైన ప్రవాహ మార్గం ద్వారా గతంలో వెళ్లిపోయేవి. నగరాలు, పట్టణాల విస్తరణ, అక్రమార్కుల కబ్జాలు, వాటికి పాలకుల ప్రోత్సాహం... ఇవన్నీ నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులుగా వున్నాయి. గత ఏడాది విజయవాడను ముంచెత్తిన వరదలు కూడా ఇలాంటివే. ప్రకృతి వైపరీత్యాల నష్టాల తీవ్రతకు పాలకుల విధాన వైఫల్యమే ప్రధాన కారణం.

# సంక్షేమ హాస్టళ్లలో పిల్లలతో వెట్టి

- శానిటేషన్ సిబ్బందిని తొలగింపు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కవిత మండిపాటు



**హైదరాబాద్, మే 28 :** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో సంక్షేమం కొరవడిందని, పిల్లలే టాయ్‌టెల్‌ఉ శుభ్రం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ . 40,000 కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు-, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించినందున పిల్లలే టాయిలెట్లు-, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీ-గా ఏర్పడి క్వాలిటీ- చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. శ్రమను గౌరవించడం నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం.. ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు- చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ- ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష, శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు. దీంతో పాటు- 240 మంది అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించడం కూడా. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు- ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు అని కవిత పేర్కొన్నారు. పోష్ పిల్లలు కాకపోయినా అందరూ పిల్లలు సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. పిల్లలతో పనిచేయించటం ఆపివేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.



# అది ఎన్డీఎస్ఏ నివేదిక కాదు ఎన్డీయే నివేదిక

- కేసీఆర్‌కు పేరు రావడం ఇష్టంలేకే కుట్రలు
- ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆరోపణలు

**హైదరాబాద్, మే 28 :** మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికను ఎన్డీయే నివేదిక అనడంలో ఎలాంటి తప్పు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. నాణ్యత లేనిది కాళేశ్వరం, మేడిగడ్డలో కాదని.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న రాజకీయాల్లోనే అని విమర్శించారు. ఎన్ని కుట్రలు సృష్టించినా.. ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుందన్నారు. అశాస్త్రీయ ఆరోపణలను ఎల్ అండ్ టీ ఖండించడం సంతోషమన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అని, కేసీఆర్ దూర దృష్టి గల నాయకుడు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ- సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ- పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు- లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీ-వల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టు-కుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం. కేసీఆర్‌కు పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్-బీజేపీ.. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ- అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితో పాటు- కాంగ్రెస్-బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం' అని ఎక్స్‌లో కేటీఆర్ రాసుకొచ్చారు.



## ఉపాధి లేకపోవడంతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుంది

**నవ చైతన్య విజ్ఞాన సమితి కార్యదర్శి బిఎస్ఆర్ మెహన్ రెడ్డి**

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేకపోవడం మూలంగా కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందని సిపిఐ రాష్ట్ర సభ్యులు బిఎస్ఆర్ మోహన్ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి జనసేవ దళ్ శిక్షణ శిబిరం ఈనెల 26 నుండి 31 వరకు చేవెళ్ల పట్టణంలోని శ్రీ సత్య సాయి గ్రామర్ హైస్కూల్లో నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర స్థాయి శిక్షణలో భాగంగా మూడవరోజు భారత ఆర్థిక వ్యవస్థ- పరిణామాలు అనే అంశంపైన జనసేవ దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నవ చైతన్య విజ్ఞాన సమితి కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ...దేశంలో బిజెపి ప్రభుత్వం మాత్రం దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నాలుగో దేశంగా ఉ ద్భవించిందని చెబుతున్నారు కాని, దేశంలో గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను కల్పించే సూక్ష్మ చిన్న పరిశ్రమలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. దేశం అభివృద్ధి చెందుతుందని చెబుతూనే మరోవైపు దేశంలో ఉన్న వారికి రేషన్ షాపుల ద్వారా 80 కోట్ల మందికి నిత్యవసర సరుకులు అందిస్తున్నామని చెప్పుతున్నారు. ప్రభుత్వాలు ప్రగతిని సాధిస్తున్నాయంటూనే, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక్కగా ఉన్నటువంటి వ్యవసాయ రంగం పూర్తిక నిర్లక్ష్యానికి విధ్వంసానికి గురైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్నటువంటి వారికి కనీస ఉద్యోగ భద్రత కూడా అసంఘటిత కార్మికులు రెండు కోట్లకు పైగా పనిచేస్తున్నారని అన్నారు. కుటుంబాలకు ఆర్థిక భరోసా లేకపోవడం మూలంగా గ్రామీణ కుటుంబ వ్యవస్థ అంతా కూడా చిన్న భిన్నం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ... దేశంలో రోజు రోజుకు మతోన్మాద శక్తులు పెచ్చురెల్లి పోతున్నాయి. ఆర్ఎస్ఎస్ కనుసైగలోని బిజెపి ప్రభుత్వం ఈ దేశ సంపదను కార్పొరేటు శక్తులకు అప్పనంగా అప్పజెప్పడం కొరకు ముమ్మరమైన ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. అందులో భాగంగానే మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటిస్తున్నప్పటికీ కూడా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి ఈ దేశంలో శాంతిని స్థాపించాలి అనేటువంటి ఉద్దేశం లేకుండా, విచక్షణ రహితంగా ఆదివాసులను మావోయిస్టుల పేరుతో కాల్చి చంపుతున్నారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జాతీయ జనసేన ఇన్స్ట్రక్టర్ మురళి, కేరళ ఇన్స్ట్రక్టర్ టిజి విష్ణు, తెలంగాణ స్టేట్ ఇన్స్ట్రక్టర్ గోష్క మోహన్, మారుపాక అనిల్ కుమార్, సిద్దినేని కర్ణ కుమార్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రామ స్వామి, రాష్ట్ర రైతు సంఘం ఉ పాధ్యక్షుడు ఎమ్ ప్రభు లింగం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి నక్క జంగయ్య, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె అంజయ్య, ఎఐటియుసి మండల అధ్యక్షుడు శివ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మీనాక్షి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళు

**ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో భీమ్ భరత్**



**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామెన భీమ్ భరత్ అన్నారు. బుధవారం మొయినాబాద్ మండలంలోని శ్రీ రామ్ నగర్ , నక్కల పల్లి, ఎథ్ బార్ పల్లి , తోల్ ల్ కట్ట గ్రామాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని లబ్ధి దారులకు భీమ్ భరత్ నియామక పత్రాలు ఇచ్చి ప్రారంభించారు. ఈ స్కీమ్ ద్వారా అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించడం జారిగిందని తెలిపారు. కాగా మొదటి విడతలో సొంత జాగా ఉన్నవారికే ప్రభుత్వం ఇండ్లను కేటాయిస్తోందన్నారు. వచ్చే విడత నుంచి ఇంటి స్థలం లేని వారికి ప్లాట్ మంజూరు చేసి రూ. 5 లక్షలతో ఇల్లు నిర్మించనుంది అని తెలియజేశారు. ఎస్సి, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి అదనంగా రూ. లక్ష సాయం అందించనున్నట్లు తెలిపారు. అంటే బీసీ, మైనార్టీ వర్గాలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు సాయంగా అందిస్తుంటే, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రూ. 6 లక్షలు సాయం అందించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లోనూ ఈ వాగ్దానం చేసింది. ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ ద్వారా ఇల్లు కట్టుకునేందుకు ఎస్టీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు, ఇతరులకు రూ. 5 లక్షలు సాయంగా అందిస్తామన్నారు. ఇప్పుడు అందుకు అనుగుణంగానే హామీని అమలు చేస్తోందని అయన ప్రభుత్వాన్ని కొనియాడారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను మహిళల పేరు మీదే అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. మహిళలు సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగున్నట్లే అని పేర్కొంది. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మహిళ పేరు మీద మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటుగా పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల కృష్ణ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు కేబుల్ రాజు, గణేష్ , నర్సింగ్ రావు, విఠల్ ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు , గ్రామ ప్రజలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**షాబాద్, రాజముద్ర న్యూస్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం షాబాద్ మండలం అంతారం, షాబాద్, సంకేపల్లి గూడ, నాగర్‌కుంట, హైతాబాద్ గ్రామాల్లో నూతనంగా నిర్మించబోయే ఇందిరమ్మ ఇండ్లకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలు



గంటి మధుసూదన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే యాదయ్య శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన ప్రతీ ఒక్కరికి తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందన్నారు. 66 గజాల స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ. 5,00,000 (ఐదు లక్షలు) ఇస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- సంబంధిత శాఖల అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బుధవారం పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో సమన్వ య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్షలను ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుండి జూన్ 13వ తేదీ వరకు ఉదయం 9-30 నుండి నిర్వహించనున్నట్లు అదన పు కలెక్టర్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 20 పరీక్ష కేంద్రాల్లో 5308 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 20 కేంద్రాల్లో పరిగి-3, తాండూర్-7, కొడంగల్-1, వికారాబాద్-5, మోమిన్‌పేట్-2, కుల్కచర్ల-2 కేంద్రాల్లో పరీక్ష లు నిర్వహించనునట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బంది నియమించాలని వైద్యాధికారికి సూచించారు. అదేవిధంగా ఫర్నిచర్, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండే విధంగా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని తెలిపారు. పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మాస్ కాపీయింగ్ కు అవకాశం ఇవ్వకూడదని ఆయన తెలిపారు. ఈ సమన్వయ సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, డిఎంహెచ్ వెంకటరవణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరం పై దాడి ఆరుగురి అరెస్ట్

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను వలిగొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఏడు వేల ఎనిమిది వందలు రూపాయలను, రెండు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం వలిగొండ మండలంలోని దుప్పెల్లి గ్రామంలో మంగళవారం రోజున రాత్రి పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం తో ఎస్ఐ యుగేందర్ గౌడ్ తమ సిబ్బందితో పేకాట స్థావరం పై దాడి చేసి వేల్పుల నరసింహ, బొమ్మగాని మారయ్య, గుణగంటి స్వామి, నెమ్మాని వెంకటయ్య, కీసరి రామచందర్ లను అరెస్టు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా బెట్టింగ్ లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉ ంటాయని ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలియజేశారు.

## వికారాబాద్ జిల్లాలో 5068.21 వ్యవసాయతర భూమి

**- వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి**


**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలో ఆయ మండలాల వారిగా వ్యవసాయతర భూమిని గుర్తించడం జరిగిందని వ్యవసాయ జిల్లా అధికారి మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బంట్వారం 2.21, భాషిరాబాద్ 451.12, బొమ్రాస్పెట్ 22.16, చౌదపూర్ 27.2, ధరూర్ 89.03, దోమ 228.03, దౌల్తాబాద్ 265.01, దుద్యాల 36.18, కొడంగల్ 198.18, కోట్ పల్లి 142.08, కులకచర్ల 47.11, మర్పల్లి 75.31, మోమిన్ పెట్ 691. 19, నవాబుపేట్ 250.08, పరిగి 485.32, పెద్దెముల్ 207.02, పూడూర్ 164.13, తాండూర్ 974.14, వికారాబాద్ 579.28, యాలాల్ 133.15 మొత్తం 5068.21 ఎకరాల భూమి ఆయా మండలాల వారిగా వ్యవసాయేతర భూమిగా గుర్తించడం జరిగిందన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**వలిగొండ రాజముద్ర న్యూస్:** క్రిమిసంహారకమందు సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలోని గుర్నాథ్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన పూర్తి వివరాల ప్రకారం మండలంలోని గుర్నాథ్ పల్లి గ్రామానికి చెందిన పంతుల రఘుపతి (42) గత యాసంగి సీజన్లో ఆరు ఎకరాల భూమిలో వరి పంట వేశారు. దీనితో అనుకున్న దిగుబడి రాకపోగా నష్టపోయి అప్పుల పాలయ్యారు. తీవ్ర మనస్థాపం చెంది ఈనెల 24వ తేదీన గడ్డి మందు తాగాడు. చికిత్స పొందుతూ 26వ తేదీన మరణించారు. ఇట్టి విషయంపై మృతిని భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు వలిగొండ ఎస్సై యుగేందర్ గౌడ్ తెలియజేశారు.

## ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలి

- గ్రామీణపేదలకు ఉపాధి పని పెట్టాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జిల్లా నాయకులు గాడి శ్రీనివాస్



**బీబీనగర్ రాజముద్ర న్యూస్:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలనీ, గ్రామీణ పేదలకు ఉపాధి పనిని కల్పించాలని, రోజు కూలీ రూ. 600 ఇవ్వాలని, 200 రోజుల పని దినాలు కల్పించాలని ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను ఉ పాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనీ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా నాయకులు గాడి శ్రీనివాసు పిలుపునిచ్చారు. బుధవారం రోజున బీబీనగర్ మండలం గొల్లగూడెం కొండమడుగు గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న గాడి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఎత్తివేయాలని చూస్తుందని అన్నారు. ఉపాధి హామీలో కొత్త కొత్త జీవోలు, రూల్స్ తెచ్చి కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. చట్టంలో దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త జాబ్ కార్డులు, భార్యాభర్తలకు గడ్డపార, తట్ట, పార, కొడవలి, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని ఉన్న ఇవ్వడంలేదని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పని దగ్గర త్రాగునీరు, నీడకు టెంట్, మెడికల్ కిట్టు వంటి సౌకర్యాలు కల్పించి నట్లే ఇప్పుడు కూడా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టంలో ఉన్నట్టు సమ్మర్ అలవెన్సు, నాలుగు కిలోమీటర్ల దూరం దాటితే లోకల్ ఆటో చార్జీలు ఇవ్వాలని కోరారు. ఆధార్ కార్డుతో లింకు, ఆన్లైన్ పేమెంట్ చెల్లింపులు, కొలతలు ఆధారంగా వేతనాలు ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని, అన్నారు. సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని అన్నారు . పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యంతో పాటు, చనిపోతే 10లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరుతూ ఈనెల 30న జరిగే కలెక్టరేట్ ధర్నాకు ఉపాధి హామీ కూలీలు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎరుకల బిక్షపతి, బండారు శ్రావణ్, ఫీల్డ్ అసిస్టెంట్ మందహేమలత ,ఉపాధి కూలీల నాయకులు గుండెబోయిన లక్ష్మమ్మ ,మొగిలి లక్ష్మమ్మ, గుండెబోయిన లక్ష్మయ్య, మేకలఐలమ్మ ,భాస్కర్ పెంటమ్మ , గుండబోయిన డబోయిన భారతమ్మ, మేకల సత్తమ్మ, మాదారం నరసమ్మ, బాత్క మమత, గుండెబోయినబోయిన లావణ్య, బాత్క కళ్యాణి, తెల్దురు మంజుల మేకల, ప్రేమలత, గుల్లని ఐలమ్మ, మంద శారదా, పడమటి లలిత, కడెం కొమరమ్మ ,జవాజి లక్ష్మి, నీలమ్మ,మనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు నష్టం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వరి ధాన్యం తడిసి రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం వికారాబాద్ కలెక్టర్ తన చాంబర్ లో వరి ధాన్యం సేకరణ, ధాన్యాన్ని మిల్లర్లకు చేరవేయటం, రవాణా సదుపాయం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రుతుపవనాలు ముందుగానే వచ్చినందున వర్షాలు కురియడం జరుగుతుందని దీనివల్ల ధాన్యాన్ని ఆరబెట్టడం ఇబ్బంది అవుతుందన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ రైతులకు నష్టం వాటిల్లకుండా వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు చేరవేసేందుకు అదనంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు చేరవేయాలని అధికారులకు సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ కలిసి ధరూర్ వ్యవసాయ మార్కెట్ గిడ్డంగి ఆవరణలో, పెద్దేముల్ మండలం మంబాపూర్ వరి కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టిన వరి ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు నష్టం జరగకుండా ధాన్యాన్ని మిల్లులకు చేర్చే విధంగా చర్య తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డిఎంసిఎస్ రాము, జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల అధికారులు, ట్రాన్స్పోర్టర్లు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందాం

- ఈ నెల 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను విజయవంతం చేద్దాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుందామని, ఈనెల 30న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే దండం విజయవంతం చేద్దామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కాడిగాళ్ళ భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం శంకర్ పల్లి మండల కమిటీ అధ్యక్షుడు బోడ మల్లేష్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకోవడం కోసం శంకర్ పల్లి మండల పరిధిలోని మహాలింగాపురం (దోబీ పెట్) గ్రామానికి వెళ్లడం జరిగిందని అయన తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ...ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి హామీ పని అమలు చేయాలని, రోజు కూలి రూ. 600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం మే 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వేల మందితో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని, కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని, భార్యా భర్తలకు గడ్డపార, తట్ట, పారా, కొడవలి, గొడ్డలి తదితర పనిముట్లు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని తదితర సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి శంకర్ పల్లి మండల పరిధిలోని ఉపాధి హామీ కూలీలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పేదల పొట్ట కొట్టే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలపై తెలంగాణ రాష్ట్రంలోని బిజెపి ఎంపీలు కేంద్ర మంత్రులు మాట్లాడడం లేదని అన్నారు. కేంద్రం మెడలు వంచి ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నర్సింలు, రవి, రాములు, బాల్ రెడ్డి, వెంకటేశం ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రవి యాదవ్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీద్ బండ లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ యువ నేత మారబోయిన రవి యాదవ్, జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు స్థానిక నేతలు, శ్రేయోభిలాషులు, అభిమానులు బీఆర్ఎస్ పార్టీహోకార్యకర్తలు, మసీద్ బండ ప్రజలు, మారబోయిన రవి యాదవ్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు మసీద్ బండ లోని తన కార్యాలయానికి వందల సంఖ్యలో రావడంతో మసీద్ బండ లోని తన కార్యాలయ ప్రాంగణం కటౌట్లు బ్యానర్లు జనసంద్రంతో పండుగ వాతావరణంలా మారింది, ఈ కార్యక్రమానికి, శ్రీకాంత్ రెడ్డి, రామ్ రెడ్డి, జర్నలిస్ట్ రాజా రవి, సిద్ధార్థ, లోకేష్, నవీన్, లక్కీ, విజయ్, ప్రశాంత్, వినయ్, అఖిల్, అరుణ్, మారెప్ప, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# సెప్టిక్ ట్యాంక్‌లో బంగారం కోసం గాలింపు..

## ఊపిరాడక నలుగురి మృతి



**జైపూర్ :** సెప్టిక్ ట్యాంక్‌లో పేరుకు పోయిన బంగారం మడ్డిని తీసుకురావడానికి అందులోకి వెళ్లి నలుగురు కూలీలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్‌లోని ఒక జ్యువెలరీ షాపు యజమాని వికాస్ మెహతా బంగారం వెండిని తమ సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్న సమయంలో అందులో కొంత మొత్తం సెప్టిక్ ట్యాంక్‌లో పేరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని బయటకు తీయాలని సోమవారం అతడు ఎనిమిది మంది కూలీలను అడగగా మొదట వారు నిరాకరించారు. బంగారు రజను తీసుకువస్తే అదనంగా డబ్బులు ఇస్తామని షాపు యజమాని ఆశ చూపడంతో చివరికి అంగీకరించారు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగేటప్పుడు వారు ఎటువంటి భద్రతా పరికరాలు తీసుకెళ్లకపోవడంతో.. గాలింపు సమయంలో ఊపిరాడక ఎనిమిది మంది కార్మికులు స్పృహ కోల్పోయారు. వారిని బయటకు తీయగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ పాల్, సంజీవ్ పాల్, హిమాంగ్షు సింగ్, అర్పిత్ యాదవ్ అనే నలుగురు కూలీలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి భద్రతా చర్యలు లేకుండా భూగర్భ సెప్టిక్ ట్యాంక్‌లోకి కార్మికులను పంపడంపై దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. అందులో నిజంగానే బంగారు రజను ఉందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆభరణాల షాపు యజమాని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ స్పందిస్తూ.. సెప్టిక్ ట్యాంకులలోకి దిగి పారిశుధ్య కార్మికులు మరణిస్తున్న ఘటనలు రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్నాయని అన్నారు. వాటిని శుభ్రపరిచేందుకు యంత్రాలను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. చర్యలు మాత్రం తీసుకోవట్లేదని విమర్శించారు. పారిశుధ్య కార్మికుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



# స్వదేశీ మానవ రహిత వైమానిక వ్యవస్థను పరిశీలించిన ఆర్మీ చీఫ్

**న్యూఢిల్లీ :** కాల్పుల విరమణ ఒప్పందంతో సరిహద్దులో భారత్-పాక్ ఉద్రిక్తలు చల్లారినప్పటికీ.. భారత సైన్యం మాత్రం పూర్తిస్థాయి సన్నద్ధతను ప్రదర్శిస్తోంది. అలాగే అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని.. పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది బబీనా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు. మానవ రహిత వైమానిక వ్యవస్థలు.. వాటిని ఎదుర్కొనేందుకు వాడే ఆయుధాలను ఆర్మీ చీఫ్ పరిశీలించారు. ఈ మేరకు అడిషనల్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. ఇవన్నీ మన బలగాల పోరాట సామర్థ్యాన్ని, కచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తాయని పేర్కొంది. అలాగే ఆ దృశ్యాలను పంచుకుంది. యూఏఎస్, కౌంటర్ యూఏఎస్‌తో పాటు లాయిటరింగ్ మ్యూనిషన్స్ గురించి ఆ పోస్టులో ప్రస్తావించింది. లాయిటరింగ్ మ్యూనిషన్ కూడా ఒక యూఏవీనే. ఇది టార్గెట్ చేసిన ప్రాంతంపై సంచరించి, ముప్పును గుర్తిస్తుంది. తర్వాత దాడిచేస్తుంది. ఆత్మాహుతి డ్రోన్లు, ఎక్స్‌ప్లోడింగ్ డ్రోన్లు దీనికిందికి వస్తాయి. ఇవి ఆటోమేటిక్‌గా ఆపరేట్ కాగలవు. మనుషులు ఆపరేట్ చేసేవిధంగానూ రూపొందించారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడానికి వీటిని ఉపయోగించారు. కాగా.. అత్యంత అధునాతన ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాన్ని సాకారం చేసే దిశగా కీలక ముందడుగు పడిన సంగతి తెలిసిందే. 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్' (ఆమ్కా) ప్రాజెక్టు అమలు కోసం 'ఎగ్జిక్యూషన్ నమూనా' తయారీకి రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. రక్షణ రంగంలో స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశీయ పరిజ్ఞానంతో ఆమ్కా ప్రాజెక్టుపై భారత్ కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. దీనికింద మధ్యశ్రేణి అధునాతన స్టెల్త్ యుద్ధవిమానాన్ని అభివృద్ధి చేస్తోంది. ఇది శత్రువుల రాడార్లను ఏమార్చి, వారి గగనతలంలోకి చొచ్చుకెళుతుంది. దీనిద్వారా భారత వైమానిక పోరాట సామర్థ్యం మరింత మెరుగుపడుతుంది. అదే రోజు ద్వివేది ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌కు వెళ్లారు.




# ఆపరేషన్ సిందూర్ లోగో రూపకర్తలు వీరే

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత మే 7న మన సైన్యం పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై చేసిన మెరుపుదాడికి 'ఆపరేషన్ సిందూర్' అని పేరు పెట్టగా.. దేశంలో లక్షల మంది భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచిన ఈ ఆపరేషను లోగోను భారత సైన్యంలోని సిబ్బందే రూపొందించారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన నిమిషాల వ్యవధిలోనే భారత సైన్యం సామాజిక మాధ్యమ హ్యాండిళ్లలో 'సిందూరం' లోగోతో కూడిన పోస్టరును పెట్టారు. మన సేనల శౌర్యానికి నిదర్శనమైన ఈ ఆపరేషనుకు అంకితమిస్తూ భారత ఆర్మీ పత్రిక 'బాత్‌చీత్' (మాటామంతీ) తాజా సంచిక వెలువడింది. లెఫ్టినెంట్ కర్నల్ హర్ష్‌గుప్తా, హవల్దార్ సురేందర్‌సింగ్ ఆ లోగోను రూపొందించినట్లుగా అందులో వెల్లడించారు.

# 14 పంటలకు మద్దతు ధర పెంపు

## బద్వేల్-నెల్లూరు 4లేన్ రోడ్డు అభివృద్ధికి కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ :** కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌లో వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ వరిపై రూ.69 పెంచడంతో కనీస మద్దతు ధర రూ.2369కి చేరింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. గత 10-11 ఏళ్లలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పీ భారీగా పెంచినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం ఎంఎస్‌పీ పెంపును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. ఆయా పంటలకు ఎంఎస్‌పీ కోసం రూ.2.7లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కోట్లుతో పాటు అన్నదాతల పెట్టుబడిపై 50శాతం మార్జిన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మరోవైపు, ఏపీలోని బద్వేల్- నెల్లూరు నాలుగు వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,653 కోట్లతో 108.134 కి.మీల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనుంది. బద్వేల్‌లోని గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలోని గురివిందపూడి వరకు నిర్మాణం చేపట్టే ఈ కారిడార్‌తో కృష్ణపట్నం పోర్టుకు ప్రయాణ దూరం దాదాపు 33.9 కిలోమీటర్లు తగ్గనుంది. అలాగే, ఈ కారిడార్ నిర్మాణంతో భారీగా



ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్రం తెలిపింది.

### ఏ పంటకు ఎంఎస్‌పీ ఎంత పెంచారంటే..

వరి సహా మొత్తం 14 ఖరీఫ్ పంటలకు క్వింటాల్‌పై కనీస మద్దతు ధర కేంద్రం పెంచింది. వీటిలో వరి సాధారణ, గ్రేడ్-ఏలకు రూ.69 పెంచగా.. జొన్నలు రూ. 328బీ సజ్జలు రూ. 150, రాగులు రూ.596, మొక్కజొన్న రూ.175, కందిపప్పు రూ.450, పెసర రూ.86, మినుములు రూ.400, వేరుశెనగ రూ.480, పొద్దుతిరుగుడు రూ.441, సోయాబీన్ రూ.436, కుసుమలు రూ.579, వలిశలు (గడ్డినువ్వులు) రూ.820, పత్తి రూ.589 చొప్పున కనీస మద్దతు ధరను పెంచారు.

# పాక్ సరిహద్దు రాష్ట్రాల్లో మాక్ డ్రిల్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో మే 29న మాక్‌డ్రిల్ నిర్వహించేందుకు భారత ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. గుజరాత్, పంజాబ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని ఆయా జిల్లాల్లో అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన తీరుపై స్థానికులకు అవగాహన కల్పించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సరిహద్దు రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పౌర సన్నద్ధతపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మే 7న దేశవ్యాప్తంగా



మాక్ డ్రిల్ నిర్వహించారు. అదేరోజు 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన భారత సైన్యం.. పాకిస్థాన్, పీవోకేలపై దాడులు చేసింది. అక్కడి ఉగ్రవాద, సైనిక స్థావరాలను ధ్వంసం చేసింది.

# ట్రంప్ కుమారుడికి సీటు ఇవ్వలేదనే హార్వర్డ్‌పై కక్ష సాధింపు చర్యలంటూ ప్రచారం

**న్యూయార్క్ :** హార్వర్డ్ విశ్వవిద్యాలయం బడ్జెట్, పన్ను మినహాయింపుల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోతలు విధించిన విషయం తెలిసిందే. తాజాగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ట్రంప్ కుమారుడు బారన్‌కు ఆ విశ్వ విద్యాలయంలో సీటు నిరాకరించడం వల్లే ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆన్‌లైన్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ట్రంప్ చిన్న కుమారుడు బారన్‌కు హార్వర్డ్, కొలంబియా, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలు సీటు నిరాకరించడంతో న్యూయార్క్ యూనివర్సిటీ స్టెర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫైనాన్స్ చదవడానికి అడ్మిషన్ తీసుకున్నట్లు పలువురు నెటిజన్లు పేర్కొన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కుమార్తె మలియాకు యూనివర్సిటీలో సీటు ఇచ్చిన హార్వర్డ్.. బారన్‌కు మాత్రం నిరాకరించడంతో అందుకు ప్రతీకారంగానే ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నారని రాసుకొచ్చారు. కాగా, ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ ప్రచారాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఖండించింది. బారన్‌పై వస్తున్న వార్తలపై డొనాల్డ్ ట్రంప్ సతీమణి మెలానియా కార్యాలయం స్పందిస్తూ.. అతడు అసలు హార్వర్డ్‌కు దరఖాస్తే చేయలేదని వివరణ ఇచ్చింది. ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీ నిధుల్లో



ట్రంప్ కోత విధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఏకంగా విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈ విశ్వవిద్యాలయం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి.. ట్రంప్ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల వివరాలను తెలుసుకోవాలనుకుంటున్నామని ట్రంప్ తెలిపారు. ఆయా దేశాలు విద్యార్థుల చదువు కోసం ఎలాంటి సొమ్ము చెల్లించడంలేదని వ్యాఖ్యానించారు.

# విద్యార్థి వీసా ఇంటర్వ్యూలకు బ్రేక్..

## ఏంటీ సోషల్ మీడియా వెట్టింగ్..?

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన విధానాలతో గందరగోళంలో ఉన్న విద్యార్థులకు ఇప్పుడు మరో దిగులు పట్టుకుంది. అదే సోషల్ మీడియా వెట్టింగ్..! విదేశీ విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాల తనిఖీపై అగ్రరాజ్యం మరింత దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా విద్యార్థి వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారి ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది.

### ఇంతకీ ఏంటీ సోషల్ మీడియా వెట్టింగ్..?

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటి వరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

### ఎలా చేస్తారు..?

దీనిపై అమెరికా విదేశాంగ శాఖ ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అయితే, ఉగ్రవాదులను నియంత్రించడం, యూదు వ్యతిరేకతను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ తనిఖీ చేయనున్నట్లు అగ్రరాజ్యం వెల్లడించింది. ఉదాహరణకు.. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని మరింత క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది. గతంలో కొం




తమంది విద్యార్థులు, ప్రొఫెసర్ల సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో బ్రౌన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. రాషా అలావీ ఫోన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ఫొటోలను గుర్తించారు. అనంతరం ఆమె ఆన్‌లైన్ యాక్టివిటీని పరిశీలించి దేశ బహిష్కరణ వేటు వేశారు. గతేడాది అమెరికా విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో పాలస్తీనా మద్దతుదారుల ఆందోళనలు పెద్ద ఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ట్రంప్ సర్కారు విదేశీ విద్యార్థులపై కన్నెర్ర చేసింది. ఈ క్రమంలోనే పలు కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి విదేశీ విద్యార్థుల రికార్డులను కూడా కోరింది. తాజాగా వీసా ఇంటర్వ్యూల సమయంలోనే 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తీసుకురానుంది. దీనివల్ల విద్యార్థి వీసా ప్రాసెసింగ్‌పై పెను ప్రభావం పడటంతో పాటు అమెరికా యూనివర్సిటీలపై ఆర్థికంగానూ భారం పడనుంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫారిన్ స్టూడెంట్ అడ్వైజర్ నివేదిక ప్రకారం.. విదేశీ విద్యార్థుల నమోదుతో అమెరికా వర్సిటీలకు ఏటా 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోంది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే బుక్ చేసుకొన్న విద్యార్థి వీసా ఇంటర్వ్యూలు ప్రణాళిక ప్రకారం కొనసాగనున్నాయి.

# వివిధ క్రీడ అకాడమీ వసతిగృహాలలో ప్రవేశాలకు దరఖాస్తు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ( శాట్స్) తెలంగాణ వారి ఆధ్వర్యములోని వివిధ క్రీడా అకాడమి, వసతి గృహాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వికారాబాద్ జిల్లా ట్రైని అసిస్టెంట్ కలెక్టర్, ఇంచార్జ్ జిల్లా యువజన, క్రీడల అధికారి హర్ష చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సర ప్రవేశానికి అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్ , రెజ్లింగ్, హాకీ, హ్యాండ్ బాల్, వాలీబాల్లలో బాలురు, బాలికల ప్రవేశాల కోరకు ఎంపికలను నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. వికారాబాద్ జిల్లాలోని అర్హులైన, ఆసక్తి గల బాలురు, బాలికలు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న స్కూల్, కాలేజీ బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రము, ఆధార్ కార్డు, క్రీడా ధృవీకరణ పత్రాలు, 10 పాస్ ఫోర్టు సైజ్ ఫోటోలతో ఒరిజినల్ జిరాక్స్ లతో ఉదయం 7.00 గంటలకు ఎంపిక ప్రదేశాలకు హాజరు కావాలన్నారు. వాలీబాల్ కు సంబంధించి జూన్ 1 సిద్దిపేట జిల్లా వాలీబాల్ అకాడమి, జూన్ 10న సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, రాజన్న సిరిసిల్ల మినీ స్టేడియం, వాలీబాల్ అకాడమీలో , జూన్ 12, 13న మహబూబ్ నగర్ మెయిన్ స్టేడియం గ్రౌండ్ లో ఎంపికలు జరుగుతాయని ఆయన తెలిపారు. జూన్ 10, 11న సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీ వెలోడ్రోమ్ , ఓయూ క్యాంపస్, హైదరాబాద్, ప్రాంతీయ క్రీడా వసతి గృహం, హనుమకొండ , జూన్ 10, 11 తేదీల్లో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ హ్యాండ్ బాల్ జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ, హన్మకొండ లో ఎంపిక నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 12వ తేదీన హాకీ అకాడమి, వనపర్తి డా. బాలకృష్ణయ్య మిని స్టేడియం, వనపర్తిలో హాకీ ఎంపిక అదేవిధంగా జిల్లా క్రీడా ప్రాదిక సంస్థ, ఖమ్మం లో జూన్ 12న అథ్లెటిక్స్ ఎంపికలు ఆయన పేర్కొన్నారు. 10 నుండి 12 సంవత్సరాల వారికి జిమ్నాస్టిక్, సిమ్మింగ్ ఎంపిక, 12 నుంచి 16 సంవత్సరాల వారికి అథ్లెటిక్స్, సైక్లింగ్, హ్యాండ్ బాల్, హాకీ, వాలీబాల్, రెజ్లింగ్ లలో ఎంపికలు ఉంటాయని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.



# ట్రంప్, పుతిన్ రండి.. కూర్చొని మాట్లాడుకుందాం : జెలెన్‌స్కీ

రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో పుతిన్ సేనలు విరుచుకుపడుతున్నాయి. ఉక్రెయిన్ ఈశాన్య సుమీ ప్రాంతంలోని నాలుగు సరిహద్దు గ్రామాలను మాస్కో సీజ్ చేసింది. ఈ నేపథ్యంలో రష్యా దండయాత్రను ఆపడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజాగా కీలక ప్రతిపాదన చేశారు. "ద్వైపాక్షిక చర్చలకు పుతిన్‌కు ఇష్టం లేకపోతే.. త్రైపాక్షిక చర్చలైనా ఫర్వాలేదు. ఏ తరహా సమావేశానికి అయినా నేను సిద్ధమే" అని జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. తనతోపాటు పుతిన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి చర్చల్లో పాల్గొనాలనే ఉద్దేశంలో ఆయన పిలుపునిచ్చారు. అలాగే శాంతి ఒప్పందానికి రాకుండా ముందుకు వెళ్తున్న రష్యాపై అమెరికా ఆంక్షలు విధించాలని డిమాండ్ చేశారు. పుతిన్ దూకుడుపై అమెరికా అధ్యక్షుడు అసహనం వ్యక్తంచేస్తోన్న సంగతి తెలిసిందే. ఆయన నిప్పుతో ఆడుకుంటున్నారని అన్నారు. "ఇక్కడ నేను లేకుండా ఉండిఉంటే రష్యాకు చాలా చెడు జరిగి ఉండేది. చాలా చాలా నష్టం జరిగి ఉండేది. ఈ విషయాన్ని పుతిన్ తెలుసుకోవడం లేదు" అని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడి చేసిన సంగతి తెలిసిందే. దానిపై కూడా ట్రంప్ తీవ్రంగా స్పందించారు. "పుతిన్‌తో నాకు మంచి సంబంధాలే ఉన్నాయి. కానీ కొన్ని సార్లు ఆయనకు ఏం అవుతుందో అర్థం కావట్లేదు. పూర్తిగా పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారు. అవసరం లేకపోయినా చాలా మందిని చంపేస్తున్నారు. ఇక్కడ నేను కేవలం సైనికుల గురించే మాట్లాడట్లేదు. కారణం లేకపోయినా ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నారు. ఆయన ఉక్రెయిన్‌లో కొంత భూభాగాన్ని కాదు.. ఆ దేశం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఆయన దృష్టిలో అది సరైనదే కావొచ్చు.. కానీ, అది రష్యా పతనానికే దారితీస్తుంది" అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా, ఉక్రెయిన్‌లు తక్షణమే కాల్పుల విరమణ చర్చలు ప్రారంభిస్తాయని కొన్నిరోజుల క్రితం ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ ఆయన ప్రకటనకు తగ్గట్టుగా అడుగులు పడలేదు. దాంతో అధ్యక్షుడి మాటల్లో ఆ చికాకు కనిపిస్తోంది.

# ట్రంప్‌తో 'బ్రొమాన్స్' ముగిసిందా..

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా మస్క్ గళం

**న్యూయార్క్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన విజయానికి సంపూర్ణ మద్దతు అందించిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన పాలకవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించిన విషయం



తెలిసిందే. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషి యెన్సీ శాఖ సారథిగా నియమించి ప్రత్యేక అధికారాలు కూడా కల్పించారు. కాగా.. ట్రంప్ ప్రభుత్వం ఇటీవల ఓ బిల్లుకు రూపకల్పన చేసింది. దీనిపై మస్క్ స్పందిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం వినిపించారు. ఈ బిల్లుకు అధిక బడ్జెట్ కేటాయించాల్సి వస్తుండడం వల్ల.. ప్రభుత్వ ఖర్చులు తగ్గించాలనే డోజ్ ఆశయాలకు అది గండి కొడుతుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి డోజ్ తీసుకు న్న చర్యలు ఈ నిర్ణయంతో వృథా అవుతాయని మస్క్ నిరాశ వ్యక్తం చేశారు. దీంతో వీరి మధ్య ఉన్న 'బ్రొమాన్స్' ముగిసిందా? అని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే జూన్ 1న ప్రసారం కానున్న ఓ ఇంటర్వ్యూలో మస్క్ మాట్లాడిన అంశాలపై పూర్తి సమాచారం తెలిసే అవకాశం ఉంది. తాజాగా ట్రంప్ యంత్రాంగం రూపొందించిన బిల్లు వల్ల దేశంలో ద్రవ్యలోటు పెరుగుతుంది. అయితే ఎన్నికల సమయంలో ట్రంప్ దేశంలో ద్రవ్యలోటును తగ్గిస్తానని ప్రజలకు హామీ ఇచ్చి..ఇప్పుడు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడంపై అమెరికాలోని మదుపరులు ఆందోళన చెందుతు న్నారు. దీంతో ఎలాన్ మస్క్ ఈ బిల్లుపై నిరాసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా అధికారం చేపట్టాక మస్క్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ శాఖ సారథిగా నియమించారు. ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులు, ప్రభుత్వశాఖల్లో వృథా ఖర్చులు తగ్గించడమే ఈ విభాగం పని. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడంలో భాగంగా ఇది అనేక మంది ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపునకు అమెరికా ప్రభుత్వానికి సూచనలు చేసింది. దీంతో ప్రభుత్వంలో మస్క్ జోక్యం ఎక్కువగా ఉంటుందనే విమర్శలు తలెత్తినప్పటికీ ట్రంప్ వాటిని ఖండిస్తూ వచ్చారు.



## ముంబయి జట్టులోకి బెయిర్ స్టో

025 ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లపై క్లారిటీ వచ్చేసింది. క్వాలిఫయర్? 1లో పంజాబ్– ఆర్సీబీ, ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్– ముంబయి తలపడనున్నాయి. నాలుగు జట్లు ఛాంపియన్?గా నిలవడమే లక్ష్యంగా ప్లేఆఫ్స్ బరిలో దిగనున్నాయి. ఈ నేపథ్యంలో ముంబయి ఇండియన్స్‌కు కాస్త ఊరటనిచ్చే వార్త. ప్లేఆఫ్స్ పోరులో ముంబయి జట్టులో టీ20 స్టార్ ప్లేయర్ బరిలో దిగనున్నాడు. ఆల్‌రౌండర్ విల్ జాక్స్ స్థానాన్ని ఇంగ్లాండ్ ప్లేయర్ బెయిర్ స్టో భర్తీ చేయనున్నాడు. ఇప్పటికే ముంబయి క్యాంప్‌లో చేరిన బెయిర్ స్టో, నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ముంబయి తమ సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేసింది. మే 30న గుజరాత్‌తో జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెయిర్ స్టో బరిలో దిగడం పక్కా! ఇది ముంబయికి కలిసొచ్చే అంశం. దీంతో ముంబయి ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు. సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మతో కలిసి బెయిర్ స్టో ఓపెనింగ్ చేసే ఛాన్స్ ఉంది. తొలి బంతి నుంచే హిట్టింగ్ ప్రారంభించే రోహిత్‌తో బెయిర్ స్టో జతకట్టనుండడం అభిమానుల్లో అంచనాలు పెంచేస్తోంది. అటు రోహిత్– ఇటు బెయిర్ స్టో ధనాధన్ ఇన్నింగ్స్‌తో జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాలని ముంబయి ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కాగా, గతేడాది జరిగిన మెగా వేలంలో బెయిర్ స్టో అన్‌సోల్డ్‌గా మిగిలి పోయాడు. వేలంలో అతడిని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. తాజాగా ఈ టోర్నీలో ఆడే ఛాన్స్ దక్కింది. విల్ జాక్స్‌కు రిప్లేస్‌మెంట్‌గా ముంబయి బెయిర్ స్టోను తీసుకుంది. అతడు రూ. 5.25 కోట్లకు ముంబయి జట్టుతో చేరాడు. కాగా, ముల్లాన్‌పూర్ వేదికగా మే 30న గుజరాత్– ముంబయి మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు క్వాలిఫయర్ 2కు అర్హత సాధిస్తుంది. ఓడిన టీమ్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అవుతుంది.

## టికెట్ల కోసం హెచ్‌సీఏ సెక్రటరీ బెదిరింపులు

- హెచ్ సీఏ వర్సెస్ సన్ రైజర్స్ వివాదం
- అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తి

సన్ రైజర్స్ హైదరాబాద్, హెచ్ సీఏ జట్ల మధ్య జరిగిన వివాదం మరో మలుపు తిరిగింది. ఈ వివాదంపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజిలెన్స్ విచారణలో విస్తుపోయే నిజాలు తెలిశాయి. హెచ్‌సీఏ అక్రమాలపై సంచలన విషయాలు బయటపడ్డాయని సమాచారం. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తయిందని, ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ అదనపు టికెట్ల కేటాయింపు వ్యవహారంలో విచారణ జరిగిన విషయం తెలిసిందే. హెచ్‌సీఏ సెక్రటరీ జగన్మోహన్ రావు సన్ రైజర్స్ ఫ్రాంచైజీ పై ఒత్తిడి తీసుకొని వచ్చినట్లు నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. టికెట్ల కోసం ఎస్ఆర్‌హెచ్ యజమాన్యాన్ని ఇబ్బందులకు గురిచేసినట్లు సమాచారం. నిజానికి ఇప్పటికే ప్రతి మ్యాచ్ కు సంబంధించి పది శాతం టికెట్లను ఎస్ఆర్‌హెచ్ ఫ్రీగా ఇస్తోంది. మరో 10 శాతం టికెట్లు కావాలని యాజమాన్యంపై సెక్రటరీ ఒత్తిడి తెచ్చినట్లు ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది.. ఇక నిబంధనలకు మించి ఫ్రీగా 10 శాతం టికెట్లు అదనంగా ఇచ్చే ప్రసక్తి లేదని ఎస్ఆర్‌హెచ్ యజమాన్యం తేల్చి చెప్పగా, ఓపెన్ మార్కెట్లో కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని జగన్మోహన్ రావు డిమాండ్ చేశారని తెలుస్తోంది. హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెడితే టికెట్లు ఇచ్చేందుకు ఒప్పుకుందని తెలుస్తోంది. తనకు వ్యక్తిగతంగా 10% టికెట్లు కావాలని జగన్మోహన్ డిమాండ్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఎస్ఆర్‌హెచ్ టికెట్లు ఇవ్వకపోవడంతో మ్యాచ్‌ల సందర్భంగా ఫ్రాంచైజీని సెక్రటరీ.. ఇబ్బందుల గురిచేశారు . లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీలకు తాళాలు కూడా వేశారు. ఎస్ఆర్‌హెచ్‌ను హెచ్‌సీఏ పెద్దలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లుగా విజిలెన్స్ నివేదికలో నిర్ధారణ అయింది. కాగా.. హెచ్‌సీఏపై చర్యలకు విజిలెన్స్ ఆదేశించగా, తాజాగా విచారణ పూర్తయి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. పాసుల విషయంలో హెచ్ సీఏ ఇబ్బందులు పెడుతున్నట్లు ఫ్రాంచైజీ వర్గాలు ఆరోపణలు చేశాయి. ఇందుకు సంబంధించిన ఒక మెయిల్ కూడా బహిర్గతమైంది. అలాగే, పాసుల కోసం హెచ్?సీఏ తమను బెదిరింపులకు గురి చేసిందని యాజమాన్యం సంచలన ఆరోపించింది. పాసులు ఇవ్వకపోతే స్టేడియంలోని కొన్ని బాక్సులకు తాళాలు వేసి ఇబ్బందులు పెట్టారని పేర్కొంది.. ఇలాగైతే తమ వల్ల కాదని.. తాము వేరే చోటుకు వెళ్లిపోతామని హెచ్?సీఏకి సన్ రైజర్స్ హైదరాబాద్ మేనేజ్మెంట్? లేఖ రాసింది. దీంతో ప్రభుత్వం వేగంగా స్పందించి, నష్ట నివారణ చర్యలకు దిగింది. విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, తాజాగా విచారణ పూర్తై, నివేదికను ప్రభుత్వానికి అందడంలో పలు విషయాలు బహిర్గతం అయ్యాయి..



## రిషభ్ పంత్ సామర్థ్యం మీద మాకు సందేహం లేదు : జహీర్ ఖాన్

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో రిషభ్‌పంత్ పెద్దగా పరుగులు చేయలేదు. అయినప్పటికీ అతడి శక్తి, సామర్థ్యాల మీద తమకు ఏమాత్రం సందేహం లేదని, పంత్‌పై పూర్తి విశ్వాసం ఉందని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మెంటార్ జహీర్ ఖాన్ అన్నాడు. ఐపీఎల్ మెగావేలంలో రికార్డు స్థాయిలో రూ.27 కోట్ల ధర పలికిన రిషభ్ ఈ టోర్నీలో అంతగా రాణించలేదు. 13 ఇన్నింగ్స్‌ల్లో 269 పరుగులు మాత్రమే చేయగలిగాడు. మంగళవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో మాత్రం అద్భుత ప్రదర్శన చేశాడు. కేవలం 61 బంతుల్లోనే 118 పరుగులతో అజేయంగా నిలిచాడు. పంత్ విజృంభించి ఆడినప్పటికీ ఈ మ్యాచ్‌లో ఆర్సీబీనే విజయం సాధించింది. 'రిషభ్ పంత్ ఒక మంచి నాయకు డు. అది మాకు సానుకూలాంశం. ఈ సీజన్‌లో బ్యాటింగ్ ఫామ్ విషయానికొస్తే.. అతడికి ఇదో లర్నింగ్ ఎక్స్‌పీరి యన్స్. కానీ పంత్ శక్తి, సామర్థ్యాల మీద ఎవ్వరికీ ఏ అనుమానమూ లేదు. అతడు ఈ సీజన్‌లో చివరి మ్యాచ్‌లో తన సెంచరీతో అందరికీ ఓ సందేశం ఇచ్చాడు' అని జహీ ర్ ఖాన్ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. అలాగే ఈ సీజన్ లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్రదర్శన గురించి కూడా మాట్లాడాడు. 'ఐపీఎల్ సీజన్ ప్రారంభం నుంచీ, ప్లేఆఫ్స్ చేరుకోవాలనే ఆశయంతోనే ఆడాలి. మేం కూడా ఆ ప్రయత్నమే చేశాం. కానీ ఈ సీజన్‌లో మేం గాయాల కారణంగా పలువురు ప్రధాన బౌలర్ల సేవలను కోల్పో యాం. అయినప్పటికీ ముందుకు సాగడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాం. బౌలింగ్‌లో పలు కాంబినేషన్ల ను ప్రయత్నించాం. కానీ దురదృష్టవశాత్తు మేం ఈ య త్నంలో విజయం సాధించలేదు. అయితే బ్యాటింగ్ విభాగం లో మాత్రం బలంగానే ఉన్నాం. ఐడెన్ మార్‌క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ వంటి విదేశీ బ్యాటర్లతో జట్టు సమతూకంగానే ఉంది' అని జహీర్ ఖాన్ తన అభిప్రాయం వ్యక్తం చేశాడు.

## కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తా : పంత్

భారతజట్టు త్వరలోనే ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ నేపథ్యంలో తాను కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తానని పంత్ అంటున్నాడు. చిన్న విరామం తర్వాత తిరిగి ఇంగ్లండ్‌తో అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం సన్నద్ధమవుతా అని వివరిస్తున్నాడు. ఇంగ్లండ్ టూర్ నేపథ్యంలో ఇటీవలే భారత జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్ పంత్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ ఐపీఎల్ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున పెద్దగా రాణించని పంత్ మంగళవారం ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ బాదాడు. 61 బంతుల్లో 118 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో ఇంగ్లండ్ పర్యటనకు ముందు తిరిగి లయ అందుకోవడం టీమ్‌ఇండియాకు శుభపరిణామం అని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'ఐపీఎల్ సీజన్ త్వరలో ముగియబోతోంది. తర్వాత టీమ్‌ఇండియా, ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో నేను కొద్ది రోజులు క్రికెట్ ఆలోచనల నుంచి దూరంగా ఉంటా. తర్వాత ఇంగ్లండ్‌తో టెస్ట్‌లకు సన్నద్ధమవుతా. ప్రతి మ్యాచ్‌లోనూ బాగానే ఆడాలని అనుకుంటాను. కానీ అన్నిసార్లూ అలా జరగదు. ఆర్సీబీతో మ్యాచ్‌లో నాకు మంచి ప్రారంభం లభించింది. దాన్ని నేను భారీ స్కోర్‌గా మలచాలి అనుకున్నాను. అలాగే నేను ఇప్పటికీ ఉత్తమ ఆటగాళ్ల నుంచి నిరంతరం నేర్చుకుంటూనే ఉంటా' అని రిషభ్ పంత్ తన మనసులోని మాటల్ని బయటపెట్టాడు.

## దినేశ్ కార్తిక్ మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి: జితేశ్ శర్మ

ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ జట్టు 20 ఓవర్లకు మూడు వికెట్లు నష్టపోయి 227 పరుగులు చేసింది. తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన బెంగళూరు 18.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 230 రన్స్ చేసింది. లఖ్‌నవూ మీద ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 33 బంతుల్లోనే 85 పరుగులు చేసి ఆర్సీబీ విజయంలో కీలక పాత్ర పోషించిన జితేశ్ శర్మ 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్'గా నిలిచాడు. తాను బ్యాటింగ్‌కు వెళ్లడానికి ముందు తమ మెంటార్ దినేశ్ కార్తిక్ చెప్పిన మాటలే స్ఫూర్తిని నింపాయని జితేశ్ అన్నాడు. కొండంత



లక్ష్యాన్ని ఛేదిచే క్రమంలో ఆర్సీబీ 123 పరుగుల వద్ద 4 వికెట్లు కోల్పోయింది. ఛేజ్ మాస్టర్‌గా పేరున్న విరాట్ కోహ్లీ 12వ ఓవర్లో తన వికెట్ కోల్పోయాడు. అప్పుడు క్రీజులోకి జితేశ్ వచ్చాడు. అక్కడి నుంచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. 257.58 స్ట్రైక్‌రేట్‌తో 85 పరుగులు చేశాడు. మయాంక్ అగర్వాల్‌తో కలిసి 107 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం జితేశ్ ఆనందం వ్యక్తం చేశాడు. 'నా సంతోషాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. ఇలా ఆడానన్న విషయాన్ని ఇంకా నమ్మలేకపోతున్నా. విరాట్ కోహ్లీ అవుట్ అయిన తర్వాత బ్యాటింగ్‌కు వెళ్లాను. మా మెంటార్ దినేశ్ కార్తిక్.. 'బాగా ఆడి.. జట్టును గెలిపించు' అని సూచించాడు. ఆ మాటలే నాలో స్ఫూర్తిని నింపాయి. నేను తర్వాత మ్యాచుల్లో కూడా ఇదే ఆటతీరును కొనసాగించే ప్రయత్నం చేస్తాను' అని జితేశ్ శర్మ వివరించాడు.



## ఓలాకు మరో ఎదురుదెబ్బ..

### మార్కెట్ వాటాలో మూడో స్థానానికి

దేశీయ విద్యుత్ ద్విచక్ర వాహన మార్కెట్‌లో ఒకప్పుడు టాప్‌లో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ క్రమంగా తన స్థానాన్ని కోల్పోతూ వస్తోంది. ప్రత్యర్థి కంపెనీలైన టీవీఎస్ మోటార్, బజాజ్ ఆటో విక్రయాలు జోరందుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మేలో మూడో స్థానానికి పడిపోయింది. దీంతో ఇప్పటికే నియంత్రణ సంస్థల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్న ఈ సంస్థకు మరో ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ప్రభుత్వ వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. మే 1– 26 మధ్య 15,221 ఓలా ఎలక్ట్రిక్ వాహన రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది మేలో నమోదైన 37,388 యూనిట్లతో పోలిస్తే సుమారు 60 శాతం తక్కువ. ఈ ఏడాది ఏప్రిల్‌లో 22.1 శాతంగా ఉన్న మార్కెట్ వాటా మే నాటికి 20 శాతానికి పడిపోయింది. గతేడాది ఇదే సీజన్‌లో ఈవీ ద్విచక్ర వాహన విభాగంలో 50 శాతం వాటాతో అగ్రగామిగా నిలిచింది. 2025 మే నాటికి టీవీఎస్ మోటార్ 25 శాతంతో తొలి స్థానంలో నిలవగా.. బజాజ్ ఆటో 22.6 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఇక ఏథర్ ఎనర్జీ వాటా 13.1 శాతంతో నాలుగో స్థానానికి పరిమితమైంది. నేటి మధ్యాహ్నం 12:17 గంటల సమయంలో కంపెనీ షేర్లు 0.95 శాతం లాభంతో రూ.53 వద్ద ట్రేడవుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరికి గాను వాహన్ పోర్టల్‌లో ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్ల సంఖ్య 8,652గా ఉంది. కంపెనీ మాత్రం 25వేల యూనిట్లు విక్రయించినట్లు ప్రకటించింది. మార్చి 20 నాటికి పోర్టల్‌లో ఈ సంఖ్య 11,781గా నమోదైంది. దీంతో ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఈ వాహన విక్రయ సంస్థ డేటాపై విచారణ చేపట్టింది. ఇప్పటికే వాహన నాణ్యత, సర్వీసుల్లో లోపాలపై సీసీపీఏ దర్యాప్తును ఎదుర్కొంటోంది. ఓలా ఎలక్ట్రిక్ యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఓలా సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ 2023 మేలో గిగాఫ్యాక్టరీ నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ.. దాని పురోగతిపై అనిశ్చితి నెలకొంది. ఇలా అనేక సమస్యలు చుట్టుముట్టడంతో ఓలా టూ వీలర్ మార్కెట్‌లో తన వాటాను క్రమంగా కోల్పోతోంది.

## టెక్ కంపెనీల్లో 50% తగ్గిన ఫ్రెషర్ల నియామకాలు

కృత్రిమ మేధ సాంకేతికత ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దీని రాకతో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరీ ముఖ్యంగా టెక్ కంపెనీల్లో ఏఐ సాంకేతికత వినియోగం విస్తృతంగా పెరగడంతో ఫ్రెషర్ నియామకాలు తగ్గాయి. గత కొన్ని సంవత్సరాల్లో టాప్ టెక్ కంపెనీల్లో ఈ ట్రెండ్ కనిపిస్తోందని తాజాగా ఓ నివేదికలో వెల్లడైంది. వెంచర్ క్యాపిటల్ సంస్థ సిగ్నల్‌ఫైర్ డేటా ప్రకారం.. టాప్ టెక్ కంపెనీల్లో ఎంట్రీ–లెవల్ నియామకాలు 15 శాతం ఉండగా.. ఇప్పుడు 7 శాతానికి పడిపోయింది. గతంతో పోలిస్తే ఏకంగా 50 శాతం క్షీణించింది. ఇది తాత్కాలికం కాదని.. టెక్ కంపెనీలు పనితీరును ఏఐ ఎలా మారుస్తుందో తెలియజెప్పేందుకు స్పష్టమైన సంకేతమని నిపుణులు భావిస్తు న్నారు. కృత్రిమ మేధ సామర్థ్యం పెరగడంతో, ఫ్రెషర్లకు జూనియర్ స్థాయి ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఏఐ కారణంగా ఇప్పటికే పలు సంస్థలు సిబ్బందిని తొలగిస్తున్నాయి. తాజాగా ఐబీఎం ఎనిమి ది వేల మందిని తొలగించింది. ముఖ్యంగా హెచ్‌ఆర్ విభాగం లో ఈ కోతలు జరిగినట్లు తెలుస్తోంది. ఆ విభాగం పనుల్ని నిర్వహించేందుకు కంపెనీలు ఏఐని ఉపయోగించడమే ఇందు క్కారణమని పలు నివేదికలు తెలుపుతున్నాయి. కొత్త టెక్ ఉద్యోగాల్లో ఈ స్కిల్స్ ఉన్న వారికే కంపెనీల ప్రాధాన్యత ఇస్తున్నా యని ది వాల్ స్ట్రీట్ జర్నల్ సర్వే తెలిపింది. దాదాపు 87 శా తం మంది రిక్రూటర్లు కృత్రిమ మేధలో అనుభవం ఉన్న అభ్య ర్థుల కోసం



ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది.

### టెక్ దిగ్గజాలూ అదే బాట..

ఎంట్రీ–లెవల్ ఉగ్యోగాల కోసం మాత్రమే కాదు.. మిడ్–లెవల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ స్థాయిలో ఏఐ విధులు నిర్వహిస్తోందని పలు టెక్ దిగ్గజాలు అభిప్రాయపడ్డారు. రానున్న 12–18 నెలల్లో తమ కంపెనీకి చెందిన లామా ప్రాజెక్ట్‌కు సంబంధించి చాలావరకు కోడింగ్‌ను ఇదే పూర్తిచే స్తుందని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ ఇప్పటికే వెల్లడించారు. ఇటీవలె మెటా లామా ఏఐ డెవలపర్ కార్యక్రమంలో పాల్గొన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల తమ కంపెనీకి సంబంధించి 20 నుంచి 30 శాతం కోడ్‌ను కృత్రిమ మేధతోనే సృష్టిస్తున్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే.

## బీఎండబ్ల్యూ ఐ7 ఏ రూ.2.05కోట్లు

**న్యూఢిల్లీ :** విద్యుత్ సెడాన్ బీఎండబ్ల్యూ ఐ7ను బీఎండబ్ల్యూ ఇండియా ఆవిష్కరించింది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ), పరిహార సెస్ వంటివి అన్నీ కలిపి, దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఈ కారు ఎక్స్–షోరూమ్ ధర రూ.2.05 కోట్లుగానే ఉంటుంది. కొత్త ధరల ప్రకారం, వినియోగదార్లపై పడే రిజిస్ట్రేషన్ వ్యయాన్ని కంపెనీయే భరిస్తుంది. ఆయా డీలర్‌షిప్‌లు దీనికి బాధ్యత తీసుకుంటాయి. సాధారణంగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంటాయి. అయినా కూడా దేశవ్యాప్తంగా ఈ కారు ధర ఒకేలా ఉండేలా చూస్తున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ విక్రమ్ పావా వెల్లడించారు. జీఎస్‌టీ, పరిహార సెస్‌ను కూడా కంపెనీయే చూసుకుంటుందని



తెలిపారు. వినియోగదారులు బీమా, టీసీఎస్, స్థానిక పన్నులను చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.



## నష్టాల్లో ముగిసిన సూచీలు..

### రాణించిన ఎల్ఐసీ షేర్లు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నప్పటికీ.. బ్లాక్‌డీల్స్, ప్రైమరీ మార్కెట్‌లో పెరిగిన యాక్టివిటీ మూలంగా నిధులు తరలివెళ్లాయి. దీంతో వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. రోజంతా ఓ మోస్తరు స్థాయిలో కదలాడి చివరికి నష్టాల్లో స్థిరపడ్డాయి. ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,457.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,551.63) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,244.02 – 81,613.36 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 239 పాయింట్ల నష్టంతో 81,312.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.75 పాయింట్ల నష్టంతో 24,752.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 85.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,317 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఎల్ఐసీ షేర్లు పైకి:** ఎల్ఐసీ షేర్లు నేడు దూసుకెళ్లాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.19,013 కోట్ల నికర లాభాన్ని (38 శాతం) కంపెనీ నమోదు చేసిన నేపథ్యంలో కంపెనీ షేర్లు ఉదయం 9 శాతం మేర లాభడ్డాయి. చివరికి బీఎస్ఈలో రూ.69.30 లాభంతో (7.96 శాతం) రూ.940 వద్ద ముగిశాయి. ఎన్ఎస్ఈలో రూ.69.50 (7.98 శాతం) లాభంతో రూ.940.75 వద్ద స్థిరపడ్డాయి.

**ఐటీసీ షేర్లు పతనం:** ఐటీసీలో బ్రిటీష్ మల్టీనేషనల్ బీఏటీ పీఎల్‌సీ 2.3 శాతం మేర తన వాటాలను బ్లాక్ డీల్ ద్వారా విక్రయించిన నేపథ్యంలో కంపెనీ షేర్లు పతనం అయ్యాయి. ఆరంభంలో 5 శాతం మేర క్షీణించాయి. చివరికి ఎన్ఎస్ఈలో 2.97 శాతం నష్టంతో రూ.421 వద్ద ముగిశాయి.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## ఫహాద్‌తో కలిసి పనిచేయాలనుకుంటున్నా


మరికొద్ది రోజుల్లో 'ఆల్ఫా'తో తనలోని యాక్షన్ కోణాన్ని తెరపై ఆవిష్కరించడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ అందాల తార అలియా భట్. ఇప్పుడామె మలయాళ విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్‌తో నటించాలనుకుంటున్నట్లు తన మనసులోని మాటను బయటపెట్టింది. ఇటీవలే కేన్స్‌లో మెరిసిన ఈ భామ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ ఫహాద్ పట్ల తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేసింది. "ఫహాద్ నిజంగా నేను ఆరాధించే నటుల్లో ఒకరు. ఆయన చాలా అద్భుతమైన నటుడు. ఆయన నటించిన చిత్రాల్లో 'ఆవేశం' నాకు చాలా ఇష్టం. కచ్చితంగా అవకాశం వస్తే అతనితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా" అని చెప్పుకొచ్చింది. "ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా సినిమాల్ని ఆస్వాదిస్తున్నారు ప్రేక్షకులు. అందుకే చిత్రపరిశ్రమలన్నీ ఒకే యూనిట్ అని మహమ్మారి రోజుల్లో తెలుసుకున్నా" అని అంది అలియా. ప్రస్తుతం 'లవ్ అండ్ వార్' సినిమా చిత్రీకరణలో ఉందామె.




## మిరాయ్ టీజర్ అదుర్స్

హనుమాన్' లాంటి భారీ హిట్ అందుకున్నా తేజ సజ్జ మళ్ళీ అదే తరహాలో 'మిరాయ్' వంటి భారీ పాన్ వరల్డ్ చిత్రంతో వస్తున్నాడు. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్న ఈ షూటింగ్‌కి, కొంచెం ఎక్కువ సమయం తీసుకుంటున్నప్పటికీ ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ అందరికీ షాకిచ్చింది. ఒక్కో పోస్టర్ మాత్రం మూవీ అంచనాలు బాగా పెంచేసింది. ఇక ఈ రోజె అవై-టె-డ్ టీ-జర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ ఊహించని రీతిలో ఉందని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉంది. ఇండియన్ సినిమా దగ్గర ఎన్నో భారీ సినిమాలు వస్తున్నాయి కానీ కంటెంట్ ఉంటే దానికి తగ్గట్టుగా కావాల్సిన ప్రామిసింగ్ విజువల్స్ కూడా చాలా మెయిన్. ఇక 'మిరాయ్' దానికి అతీతంగా ఉందని చెప్పడంలో సందేహం లేదు. స్టన్నింగ్ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఒక హాలీవుడ్ సినిమా చూస్తున్న ఫీల్ వచ్చింది. ముఖ్యంగా మంచు మనోజ్.. అదరకొట్టాడు. సాహస సన్నివేశాల్లో తేజ ఎక్కడా కూడా అసలు కాంప్రమైజ్ అయినట్టే కనిపించడం లేదు. అలాగే ఇండియన్ సినిమాకు ఒక సరికొత్త అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమాగా ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది. ఇక లాస్ట్ షాట్‌లో రాముని రాకపై చూపించిన విజువల్ వర్ణనాతీతం.. మొత్తానికి 'మిరాయ్' తెలుగు ఇండస్ట్రీని మరో మెట్టు-ఎక్కించేలా కనిపిస్తుంది.

## తదుపరి సినిమాలపై మహేశ్ టీమ్ ఫోకస్



గుంటూరు కారం సినిమా తర్వాత మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఇప్పటికీ ఈ సినిమా టైటిల్ ఫిక్స్ చేయలేదు. ప్రస్తుతానికి పలు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సమ్మర్ బ్రేక్ ఇచ్చారు. ఎప్పటిలాగే మహేష్ బాబు వెకేషన్‌కి వెళ్లిపోయాడు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ షెడ్యూల్ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది, సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే విషయం మీద ఎవరికీ క్లారిటీ- లేదు. అయినప్పటికీ ఈ సినిమా పూర్తయిన తర్వాత మహేష్ బాబు ఎవరితో సినిమా చేయాలనే విషయం మీద ఆయన టీం ప్లానింగ్ రెడీ చేస్తోంది. నిజానికి ఈ సినిమా పూర్తి అయిన వెంటనే ఆయన ముగ్గురు దర్శకులను లైన్‌లో పెట్టారు. ముందుగా సందీప్ రెడ్డి డైరెక్షన్‌లో ఒక సినిమా చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు-చెబుతున్నారు. ఒకవేళ అప్పటికే సందీప్ రెడ్డి సిద్ధంగా లేకపోతే, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సినిమా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఎందుకంటే కల్కి సినిమా తర్వాత ఆ సినిమా బాగా నచ్చడంతో మహేష్ బాబు స్వయంగా ఆయనతో సినిమా చేయడానికి ఆసక్తి చూపాడు. వైజయంతి మూవీస్‌తో అనుబంధం కారణంగా నాగ్ అశ్విన్ కూడా మహేష్ తో సినిమా చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.



## రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ

గుంటూరు కారం' సినిమా తర్వాత త్రివిక్రమ్ ఎవరితో సినిమా చేస్తాడు అనే విషయం మీద చాలా చర్చలు జరిగాయి. మొదట ఈ మాటల మాంత్రికుడు అల్లు అర్జున్‌కి కథ చెప్పాడు, దాదాపుగా అది ఫిక్స్ అయిపోయింది అనుకున్న తరుణంలో, అల్లు అర్జున్‌కి, కథ నచ్చకపోవడంతో ఆయన అట్లీతో సినిమా చేసేందుకు వెళ్లారు. ఇప్పుడు త్రివిక్రమ్ ఇతర హీరోలతో సినిమాలు చేసేందుకు ప్లానింగ్ చేసి, చివరికి వెంకటేష్ హీరోగా ఒక సినిమా ఫైనల్ చేశారు. ఇందులో హీరోయిన్‌గా రుక్మిని వసంత్ ని కూడా ఫిక్స్ చేశాడు. అయితే ఇప్పుడు ఈ మూవీకి సంబంధించిన మరో షాకింగ్ న్యూస్ వైరల్ అవుతుంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం రామ్ చరణ్‌ను సంప్రదించగా, ఆ పాత్రలో నటించేందుకు చరణ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇక త్వరలోనే ఆ సినిమా పట్టాలెక్కనున్నది. ఇక ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాని ప్రకారం రామ్ చరణ్ తర్వాత సినిమా కూడా త్రివిక్రమ్ శ్రీనివాస్‌తోనే ఉండబోతోంది. ప్రస్తుతానికి రామ్ చరణ్ 16వ సినిమాగా 'పెద్ది' రూపొందుతోంది. ఈ సినిమా పూర్తియిన వెంటనే ఆయన వెంకటేష్ సినిమాలో నటించబోతున్నాడు. ఆ సినిమా పూర్తి అయిన వెంటనే త్రివిక్రమ్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో ఒక మంచి పాన్ ఇండియా సబ్జెక్ట్ రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఆ రకంగా రామ్ చరణ్ బ్యాక్ టు-బ్యాక్ ప్రాజెక్ట్స్ గురూజీ తోనే చేయబోతున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇప్పటివరకు త్రివిక్రమ్ ఏ సినిమా చేసినా సితార ఎంటర్-టైన్‌మెంట్స్ లేదా హారిక హాసినితోనే చేసేవాడు. కానీ ఇప్పుడు రామ్ చరణ్‌తో చేయబోయే సినిమాకి కొత్త బ్యానర్ ఒకటి రంగంలోకి దిగబోతున్నట్లుగా తెలుస్తోంది.

## థియేటర్ల బంద్.. ఎవరో మిస్ గైడ్ చేశారు : రాజేంద్రప్రసాద్

థియేటర్‌ల బంద్ చిన్న విషయం కాదన్నారు సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్. తన తాజా చిత్రం 'షష్టిపూర్తి' ప్రీరిలీజ్ వేడుకలో ఆయన పాల్గొన్నారు. 'లేడీస్ టైలర్' విడుదలైన 38 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. రూపేశ్, ఆకాంక్ష సింగ్ కీలకపాత్రల్లో నటించారు. పవన్ ప్రభ దర్శకుడు. మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. "థియేటర్‌లు మూసేయడం అనేది ఒకరు చెబితే చేసేది కాదు. అది సమష్టిగా తీసుకోవాల్సిన నిర్ణయం. దీన్ని ఎవరో మిస్ గైడ్ చేశారు. చివరకు ఏమైంది.. అది నిలబడలేదు కదా. పవన్ కల్యాణ్ ఫీల్ అయ్యాడంటే అది సరైనదే అవుతుంది. ఇలాంటివి సృష్టించిన వారిని కనిపెడి



తే ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుంది. థియేటర్లను బంద్ చేస్తాం అనే మాట చిన్నది కాదు.. ఇలాంటివి ఇంకెప్పుడూ జరగకూడదని కోరుకుంటున్నాను. పవన్ ఈ విషయంలో బాధ్యత తీసుకొని దీని వెనక ఎవరున్నారో కనిపెట్టాలని కోరడం హర్షించదగ్గ విషయం" అని అన్నారు. తన కెరీర్ గురించి రాజేంద్రప్రసాద్ మాట్లాడు తూ.. "నేను ఎప్పుడూ జేబు నింపుకోవడానికి సినిమాలు చేయలేదు. ఒకవేళ నేను సంపాదించిన డబ్బును కొందరు హీరోలు పెట్టుబడులు పెట్టినట్లు పెట్టి ఉంటే ఈ పాటికి మద్రాసు, హైదరాబాద్‌లలో వేల కోట్ల రూపాయల ఆస్తులుండేవి. సంపాదన గురించి పట్టించుకోకుండా సినిమాలు చేశాను. మంచి పాత్ర అవునా.. కాదా అనేది మాత్రమే చూస్తాను. పవన్ కల్యాణ్ నాకు తమ్ముడితో సమానం. ఆయన సినిమాలో నటించడం ఎందుకో కుదర్లేదు. త్వరలోనే ఆ అవకాశం రావాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.




## హరిహర వీరమల్లు నిధి సాంగ్ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకులు క్రిష్ జాగర్లమూడి అలాగే జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఎప్పుడో రావాల్సింది.. కానీ ఎన్నో ఇబ్బందులు ఎదురుకొని ఫైనల్‌గా ఈ జూన్ 12న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కాబోతుంది. ఇక విడుదల సమయం దగ్గర పడుతుండడంతో, ఒక్కో అప్ డేట్ వదులుతున్నారు మూవీ మేకర్స్. కాగా ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ కాగా, తాజాగా సినిమా నుంచి నాలుగో సాంగ్ కూడా విడుదలైంది. ఇక ఈ సాంగ్ లో నిధి లుక్ అదిరిపోయింది. లిరిక్స్ బ్యాగ్రౌండ్ స్మూత్‌గా కిక్కిచ్చేలా ఉందని చెప్పాలి. కీరవాణి మంచి ట్యూన్‌ని అందించగా శ్రీహర్ష ఈమని ఇచ్చిన సాహిత్యం కూడా బాగుంది. ఇక ఈ సాంగ్ లో లిప్సిక భాష్యం గొంతు, బాగా ప్లస్ అయ్యిందని చెప్పాలి. అలాగే సాంగ్ లో విజువల్స్ కూడా ఒకింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాంగ్ మూడ్ కి తగ్గట్టుగా సెట్ చేసిన సెట్టింగ్స్ విశేషంగా ఆకట్టు-కుంటు-న్నాయి. ఇక నిధి అగర్వాల్ అయితే మెయిన్ ఎసెట్ అని చెప్పవచ్చు. తన గ్లామర్ ఇంకా తన డాన్స్ మూమెంట్స్ సాంగ్ లో చాలా బాగున్నాయి. మొత్తానికి నాలుగో పాట కూడా అదిరిపోయింది.

## ఎప్పుడూ మనసు చెప్పేదే వింటాను

### : దీపికా పదుకొణె

ఎప్పుడూ తన మనసు చెప్పేదే వింటానన్నారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె. ఏ కార్యక్రమంలోనైనా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచే ఆమె.. తాజాగా ఓ ఫ్యాషన్ షోలో హొయలొలికించారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "జీవితంలో బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే నిజాయతీ ముఖ్యం. నేను దానికే ప్రాధాన్యతనిస్తాను. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నా మనసు చెప్పేది వింటాను. ఆ తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాను" అని దీపికా చెప్పారు. రెండు రోజులుగా దీపికా పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తన సినిమాను లీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ ఒక స్టార్ డైరెక్టర్ చేసిన కామెంట్స్ ఆమెను ఉద్దేశించే అంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాయతీ గురించి దీపికా చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ఆ వివాదాన్ని ఉద్దేశించే అనుకుంటున్నారు. దీపికా చివరిసారిగా 'సింగం అగైన్'లో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com